JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 06-06-2026
Medchal - Malkajgiri । Saturday 06-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 05
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 05 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




# కేసీఆర్ రాసిపెట్టుకో..

- మీరు చేసిన పాపాలు కాశీకి పోయినా పోవు
- కేసీఆర్.. చర్చకు అసెంబ్లీకి రా!
- తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం.. ఒప్పించే బాధ్యత నాది
- పాలమూరులో మీ పార్టీని బొందపెడతాం: సీఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, పాలమూరు :**

పాలమూరు ప్రజలకు మట్టి తీసుడే కాదు.. నమ్మకద్రోహులను మట్టితో కప్పడం కూడా తెలుసు. కేసీఆర్ రాసిపెట్టుకో.. పాలమూరు జిల్లాలో మీ పార్టీని బొంద పెడతాం. రాబోయే ఎన్నికల్లో మీ పార్టీ తరఫున ఒక్కరిని కూడా ఎమ్మెల్యేగా గెలవనీయం అంటూ రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

"పాలమూరులో గెలిపించి గుండెల్లో పెట్టుకుంటే.. ఇక్కడి ప్రజలను మోసం చేసి గజ్వేల్‌కు పారిపోయిన కేసీఆర్ పాలమూరు ద్రోహి. మీ జిల్లా బిడ్డగా పుట్టి, ఈ మట్టి రుణం తీర్చుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తున్న నేను పాలమూరు బిడ్డను" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. జడ్చర్లలో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీలపై నిప్పులు చెరిగారు. జిల్లాలో వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు స్వయంగా చూసిన వ్యక్తిని, అందుకే రెండు రోజులుగా జిల్లాలోనే ఉండి సాగునీటి ప్రాజెక్టులను స్వయంగా పరిశీలిస్తున్నానని తెలిపారు.

**మీరు చేసిన పాపాలు కాశీకి పోయినా పోవు**

పాలమూరు ప్రజలకు ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా.. గతంలో ఇక్కడికి రాజకీయంగా వలసవచ్చిన కేసీఆర్‌ను ప్రజలు ఆదరించారని సీఎం గుర్తుచేశారు. కానీ కేసీఆర్ 'మేకవన్నె పులి' అని గుర్తించక రెండుసార్లు సీఎంను చేస్తే.. పదేళ్లలో జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఉద్దండపూర్ మునిగితే పరిహారం కోసం రూ. 800 కోట్లు ఇవ్వకుండా, నిర్వాసితులను జైల్లో పెట్టి కొట్టించిన చరిత్ర కేసీఆర్‌దని ఆగ్రహం వ్యక్తంచేశారు. "దొంగలకు సద్దులు మోసేటోళ్లు ఇప్పుడు జిల్లాలో పాదయాత్రలు చేస్తారట. పాదయాత్ర కాదు.. కాశీ దాకా పోయి పొర్లుదండాలు పెట్టినా మీరు చేసిన పాపాలు తొలిగిపోవు. పంచలు కట్టుకుని ఊర్లలోకి వస్తే ఇక్కడి ప్రజలు ఉరికించి కొడతారు జాగ్రత్త" అని హెచ్చరించారు.

**కేసీఆర్.. చర్చకు అసెంబ్లీకి రా!**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు, తమ రెండున్నరేళ్ల (30 నెలల) పాలనకు అసెంబ్లీలో చర్చకు రావాలని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. "నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా. మాది తప్పైతే నేను క్షమాపణ చెబుతా. మీరు జైళ్లు కట్టాలని చూస్తే.. మేం స్కూళ్లు కట్టాలని చూశాం. పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కొడంగల్‌లో భారీ ఎడ్యుకేషన్ హబ్‌ను నిర్మిస్తున్నాం. పిల్లలను చదివించండి.. చదువుకుంటేనే బతుకులు బాగుపడతాయి" అని పిలుపునిచ్చారు. హనుమాండ్ల గుడి లేని తండా ఉండొచ్చేమో కానీ.. ఇందిరమ్మ ఇల్లు లేని గూడెం లేదని, తాము అధికారంలోకి వచ్చాక సాధించిన ప్రగతి

...మిగతాది 2 లో

దశాబ్దాల తరబడి కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఉమ్మడి పాలమూరు జిల్లా తలరాతను మార్చే సందర్భం ఇది. పాలమూరు బిడ్డగా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే సంకల్పం తీసుకున్నాను. రెండు రోజుల పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో కృష్ణా నది పై నిర్మాణంలో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను స్వయంగా క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాను. పాలమూరు లో 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కార్యచరణ తీసుకున్నాను. పెండింగ్ పనులు, ఆయా ప్రాజెక్టుల కింద భూ సేకరణ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను. అవసరమైన నిధులను గ్రీన్ ఛానెల్ లో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పాను. మిడ్జిల్ మండలంలో 20 ఏళ్ల క్రితం జెడ్పీటీసీగా ఇక్కడ ప్రజలు నాటిన మొక్క ఇవ్వాళ మహావృక్షంలా పెరిగి ఈ ప్రాంతానికి నీడ నిచ్చే స్థాయికి ఎదిగిందని నా ప్రజలతో ఆనందాన్ని పంచుకోవడానికి రెండు రోజుల పర్యటన ముగింపులో భాగంగా జడ్చర్లలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" సభలో పాల్గొన్నాను.

-- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# పాములాడించే దేశం నుంచి డిజిటల్ పవర్‌హౌస్ దాకా..

- మోదీ హయాంలో మారిన భారత్ గుర్తింపు
- భారత రాజకీయ చరిత్రలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై నిరంతరాయంగా అత్యధిక కాలం పాలించిన ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఈ జూన్ 10న సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న దశాబ్దాల రికార్డును ఆయన అధిగమించబోతున్నారు. ఈ మైలురాయి దేశ పరిపాలనా వ్యవస్థలో వచ్చిన విప్లవాత్మక మార్పులకు అద్దం పడుతోంది.



**జయభేరి, న్యూఢిల్లీ:**

స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిరంతర పాలన రికార్డును ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ఈ జూన్ 10వ తేదీన అధిగమించబోతున్నారు. ఈ చారిత్రాత్మక మైలురాయి కేవలం రాజకీయ ప్రాధాన్యత కలిగినది మాత్రమే కాదు, రెండు వేర్వేరు కాలాల భారతదేశ పరిపాలనా విధానాలను పోల్చి చూసేలా చేస్తోంది. నాడు నెహ్రూ హయాం దేశంలో నూతన ప్రభుత్వ సంస్థల నిర్మాణానికి పునాది వేస్తే, నేటి మోదీ హయాం ఆ వ్యవస్థలను ఆధునిక సాంకేతికతతో ప్రజల దరి చేర్చడంలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఒకప్పుడు కేవలం సిద్ధాంతాల ఆధారంగా సాగిన అభివృద్ధి ప్రసంగాల స్థానంలో, నేడు సాంకేతికత ఆధారంగా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలను అందించే అత్యాధునిక పరిపాలన అందుబాటులోకి వచ్చింది. ఈ పరిణామం పౌరులకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న సంబంధాన్ని పూర్తిగా మార్చేసింది.

దేశీయంగా వచ్చిన ఈ భారీ మార్పు అంతర్జాతీయ వేదికలపై భారతదేశ కీర్తిని మరింత పెంచింది. ఒకప్పుడు భారతదేశాన్ని కేవలం 'పాములాడించే దేశం'గా చూసిన విదేశీ శతాబ్దాల నాటి పాత ఆలోచనా విధానాన్ని మార్చేలా, నేటి భారత్ ప్రపంచాన్ని డిజిటల్ రంగంలో నడిపించే 'మౌస్ చార్మర్స్' (కంప్యూటర్ మౌస్ ఉపయోగించే మేధావులు) దేశంగా అవతరించిందని ప్రధాని మోదీ గతంలో

...మిగతాది 2 లో

# విశాఖ రోడ్లపై సీఎం చంద్రబాబు ఊహించని సైకిల్ సవారీ



- విశాఖ పర్యావరణ వేడుకల్లో సీఎం చంద్రబాబు మొక్కలు నాటి, పచ్చదనం పెంపునకు సైకిల్ యాత్ర చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

**జయభేరి, విశాఖపట్నం :**

ప్రకృతి పచ్చగా ఉంటేనే మనుషుల మనుగడ సాఫీగా సాగుతుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులతో పొంచి ఉన్న ముప్పును పారద్రోలేందుకు విస్తృతంగా మొక్కలు నాటడం ఒక్కటే మన ముందున్న ప్రధాన మార్గం. ఇదే స్ఫూర్తిని రగులుస్తూ విశాఖపట్నం వేదికగా జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ స్వయంగా మొక్కలు నాటి అందరికీ ఆదర్శంగా నిలిచారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) ప్రాంగణంలో పర్యటించిన ముఖ్యమంత్రి అక్కడ కేవలం 25 శాతం మాత్రమే పచ్చదనం ఉండటం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తక్షణమే క్యాంపస్ అంతటా భారీగా మొక్కలు పెంచేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీని ఆయన ఆదేశించారు.

ఇదే సమయంలో పార్టీ నాయకులను ఉద్దేశించి సీఎం ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. ఎవరైతే ఎక్కువ మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందిస్తారో, రాబోయే ఎన్నికల్లో వారికే టిక్కెట్లు ఇస్తామంటూ సరదాగా నవ్వులు పూయించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంతో మంది గొప్ప నాయకులను దేశానికి అందించిన ఒక ప్రతిష్టాత్మక విద్యాసంస్థ. అలాంటి ప్రాంగణం పర్యావరణానికి ఆదర్శంగా, ఒక బయో డైవర్శిటీ పార్కులా రూపాంతరం చెందాలని చంద్రబాబు ఆకాంక్షించారు. తిరుమల కొండల మీద 89.5 శాతం పచ్చదనం ఉందన్న విషయాన్ని గుర్తుచేస్తూ, ఏయూ క్యాంపస్ కూడా పూర్తిగా పచ్చదనంతో నిండిపోయి 'నెట్ జీరో' క్యాంపస్‌గా మారాలని పిలుపునిచ్చారు. విపరీతంగా పెరుగుతున్న ఎండలు, అకాల తుఫానులు వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందనడానికి సంకేతాలని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అరికట్టే క్రమంలో ఏయూకు ఉన్న 450 ఎకరాల సువిశాల స్థలంలో ఖాళీ ప్రదేశాలన్నింటిలో చెట్లు నాటాలని సూచించారు. భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి, క్యాంపస్‌కు అవసరమైన విద్యుత్‌ను పూర్తిస్థాయిలో సౌరశక్తి ద్వారానే ఉత్పత్తి చేసుకునే దిశగా అడుగులు వేయాలని స్పష్టం చేశారు. చెత్త నిర్వహణ విషయంలో ఏయూ యాజమాన్యం అత్యాధునిక విధానాలు అవలంబించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ద్వారా

...మిగతాది 2 లో

# అగ్ని ప్రమాద బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలి.. కవిత



**జయభేరి, హైదరాబాద్ :**

అమీర్ పేట్ మైత్రివనం ఎదురుగా అగ్నిప్రమాదం జరిగిన షాపింగ్ కాంప్లెక్స్ ను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని కవితకు బాధితులు వివరించారు. కవిత మాట్లాడుతూ మీర్ పేట్ లో జరిగిన అగ్నిప్రమాదం సడెన్ గా జరిగింది కాదు. వెనుక వైపు ఉన్న మెస్ కారణంగా గతంలో షార్ట్ సర్క్యూట్ జరిగిందని చెబుతున్నారు. అగ్ని ప్రమాదం జరిగే పరిస్థితులు ఉన్నాయని మూడు నెలలుగా అధికారులకు చెబుతూనే ఉన్నారు. కానీ అధికారులు నిర్లక్ష్యం చేయటం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. అగ్నిప్రమాదం కారణంగా దాదాపుగా మూడు నుంచి నాలుగు కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగింది. ప్రమాదం జరిగిన గంట పావు వరకు కూడా ఫైరింజన్లు రాకపోవటం దారుణం. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఆలోచన చేయాలి. సరైన సమయానికి ఫైరింజన్లు వచ్చి ఉంటే ఆస్తి నష్టం చాలా వరకు తగ్గేది. ప్రమాదం జరిగిన షాప్ వాళ్లందరికీ కూడా ఎన్ఓసీ లు ఉన్నాయి. వాళ్లందరికీ నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి. హైడ్రా వాళ్లు వచ్చి ఇన్ స్పెక్షన్ చేశారని చెబుతున్నారు. ఈ ఏడాది ఎండకాలంలో అగ్నిప్రమాదాలు జరగకుండా చేపట్టిన చర్యల కారణంగా మంచి ఫలితాలు వచ్చాయి. కానీ ఇంకా కూడా సీరియస్ గా ఈ అంశంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అదృష్టవశాత్తు ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదు. ఇలాంటి ప్రమాదాలు ఎప్పుడైనా జరగవచ్చు. కనుక అగ్ని ప్రమాదాలు జరగకుండా ఇలాంటి బిల్డింగ్ ఉన్న చోట ఇన్ స్పెక్షన్ చేయాలని అన్నారు.



# ఒక్క క్లిక్‌తో లక్షలు మాయం

- అందమైన అమ్మాయి ఫ్రెండ్ రిక్వెస్ట్ వస్తే జాగ్రత్త
- హనీ ట్రాప్, నకిలీ ఇన్వెస్ట్మెంట్ యాప్‌లతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయి, వరంగల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి 18 లక్షలు కాజేశారు, పోలీసులు 1930కు ఫిర్యాదు చేయమంటున్నారు

**జయభేరి, వరంగల్ :**

ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, సైబర్ నేరాలు కూడా అంతకంటే వేగంగా పెరుగుతున్నాయి. రోజుకో కొత్త పద్ధతితో సైబర్ నేరగాళ్లు ప్రజలను లక్ష్యంగా చేసుకుంటూ భారీ స్థాయిలో మోసాలకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు సాధారణ ప్రజలే ఎక్కువగా మోసపోయేవారు. కానీ ఇప్పుడు ఉన్నత విద్యావంతులు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు సైతం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారు. డిజిటల్ లావాదేవీలు, సోషల్ మీడియా వినియోగం, ఆన్‌లైన్ పెట్టుబడులు, డేటింగ్ యాప్‌ల వినియోగం పెరగడంతో సైబర్ నేరగాళ్లకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ నకిలీ ఇన్వెస్ట్మెంట్ యాప్‌ల ద్వారా మోసాలు చేస్తున్నారు. మరోవైపు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## కేసీఆర్ రాసిపెట్టుకో..

'రాస్తే రామాయణం.. చెబితే భారతం' అంత ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తమ పాలనలో 15 లక్షల రేషన్ కార్డులు, 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తూ.. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

**పాలమూరులో బీఆర్ఎస్‌ను బొందపెడతాం**

"నేను జడ్పీటీసీగా ఉన్నప్పుడు మీరు నాటిన మొక్క.. ఈరోజు ముఖ్యమంత్రిగా వృక్షమై మీ ముందుకు వచ్చింది. మీ పాలమూరు బిడ్డగా ఈ 30 నెలల్లోనే జిల్లా ప్రాజెక్టుల కోసం రూ. 8 వేల కోట్లు ఖర్చు చేశా. పాలమూరు ప్రజలకు మట్టి తీసుడే కాదు.. నమ్మకద్రోహులను మట్టితో కప్పడం కూడా తెలుసు. కేసీఆర్ రాసిపెట్టుకో.. పాలమూరు జిల్లాలో మీ పార్టీని బొంద పెడతాం. రాబోయే ఎన్నికల్లో మీ పార్టీ తరపున ఒక్కరిని కూడా ఎమ్మెల్యేగా గెలవనీయం" అని సీఎం ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్ పార్టీదే అధికారమని, 2029లో మళ్లీ 'ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్' రావడం ఖాయమని సవాల్ విసిరారు.

**తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం.. ఒప్పించే బాధ్యత నాది**

గోదావరి జలాల విషయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దాగుడుమూతలాడుతున్నారని, బీజేపీ నేతలు కూడా సమాధానం చెప్పలేక తప్పించుకు తిరుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. "ఎవరు ఎన్ని దాగుడుమూతలాడినా వదిలేది లేదు. అడుగుతాం.. కడుగుతాం.. తుమ్మిడి హెట్టి కట్టి తీరుతాం. మీరు బురద చల్లినా, తలకిందులుగా తపస్సు చేసినా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీల నీటిని ఒప్పించే బాధ్యత, గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత నాది" అని స్పష్టం చేశారు. జిల్లాలో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా ప్రాజెక్టులు పూర్తి కావాలని, దొంగలు, దోపిడీదారులు, దొంగలకు సద్దులు మోసేటోళ్లు వస్తుంటారు.. పాలమూరు బిడ్డలు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## డిజిటల్ పవర్‌హౌస్ దాకా..

వ్యాఖ్యానించారు. ఈ చారిత్రాత్మక రూపకం నేటి భారతదేశ డిజిటల్ ఆర్థిక శక్తినే కాకుండా ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ చెల్లింపులు జరుగుతున్న దేశంగా మన సామర్థ్యాన్ని చాటిచెబుతోంది. భారతదేశం ఈ మైలురాయిని దాటుతున్న తరుణంలో నాడు భారీ ప్రభుత్వ ప్రణాళికలతో ప్రారంభమైన ప్రయాణం, నేడు సాంకేతికతతో కూడిన వేగవంతమైన పరిపాలనా వ్యవస్థగా రూపాంతరం చెంది 21వ శతాబ్దపు నవభారతానికి దిక్సూచిగా నిలిచింది.

**సంక్షేమ పథకాల పంపిణీలో మార్పు**

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో భారతదేశం వనరుల పంపిణీ కోసం, పేదరిక నిర్మూలన కోసం ఎక్కువగా ప్రభుత్వ నియంత్రణలు, సాంప్రదాయ బ్యూరోక్రాటిక్ (అధికార యంత్రాంగం) మార్గాలపైనే ఆధారపడింది. అయితే ఈ పాత పద్ధతుల వల్ల క్షేత్రస్థాయిలో నిధుల దుర్వినియోగం, విపరీతమైన ఆలస్యం వంటి ఎన్నో పరిపాలనాపరమైన ఇబ్బందులు ఎదురయ్యేవి. దీనికి భిన్నంగా ప్రస్తుత మోదీ ప్రభుత్వం సాంకేతికతకు మొదటి ప్రాధాన్యతనిస్తూ మధ్యవర్తుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించింది. క్లిష్టమైన ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, లబ్ధిదారులకు నేరుగా సహాయం అందించే సరికొత్త నమూనాను అమలులోకి తెచ్చింది. దీనివల్ల కనీస అవసరాలు అనేవి కేవలం ప్రభుత్వ దయాదాక్షిణ్యాలుగా కాకుండా, నిశ్చయించిన సమయానికి పౌరులకు అందాల్సిన హక్కులుగా మారాయి.

**డిజిటల్ సేవలతో పౌరుల సాధికారత**

ఈ ఆధునిక పరిపాలనా మార్పుకు ప్రధాన కారణం దేశంలో ఆర్థిక చేరిక, డిజిటల్ సంక్షేమ రంగాలు బలోపేతం కావడమే. జన్ ధన్ ఖాతాలు, మొబైల్ నంబర్ల అనుసంధానంతో కూడిన సమగ్ర డిజిటల్ వ్యవస్థ మరియు 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' (DBT) విధానం ద్వారా ప్రభుత్వ ఆర్థిక సహాయం నేరుగా అర్హులైన పౌరుల బ్యాంకు ఖాతాల్లోకి క్షణాల్లో జమ అవుతోంది. ఈ డిజిటల్ సంక్షేమ విప్లవంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని లక్షలాది పేద కుటుంబాలకు పక్కా గృహాలు, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన వంట గ్యాస్ కనెక్షన్లు, ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా వంటి భారీ మౌలిక సదుపాయాల పథకాలను ప్రభుత్వం వేగంగా పూర్తి చేసింది. ప్రతి పేద కుటుంబానికి శాశ్వత ఆస్తులను సృష్టించడం ద్వారా వారు ఆర్థిక భద్రతను పొంది పేదరికం నుండి శాశ్వతంగా బయటపడేలా ఈ వ్యూహం తోడ్పడుతోంది.

## విశాఖ రోడ్లపై సీఎం చంద్రబాబు ఊహించని సైకిల్ సవారీ

వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ఉత్పత్తి చేయాలన్నారు. స్వచ్ఛ పథం కింద రీసైక్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ చేపట్టాలని సూచించారు. పీఎస్జీ, ఎలక్ట్రికల్ స్టవ్స్ వినియోగాన్ని పెంచాలని, నెట్ జీరో విధానాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ప్రొఫెసర్లతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఏయూ క్యాంపస్ కేవలం చదువులకే పరిమితం కాకుండా విద్యార్థులకు ఒక నాలెడ్జ్ హబ్‌గా తయారు కావాలని సీఎం ఆకాంక్షించారు. ఈ నెట్ జీరో విధానంలో ఇతర విద్యా సంస్థలకు సైతం మార్గదర్శకంగా నిలిచేలా ఏయూను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఒక బ్లూ ప్రింట్ సిద్ధం చేస్తున్నామని, ఇందులో విద్యార్థులను కూడా భాగస్వాములను చేస్తామని ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5 కోట్ల సీడ్ బాల్స్ చల్లేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. విశాఖపట్నం నగరంలో ప్రస్తుతం ఉన్న పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. పర్యావరణాన్ని పరిరక్షించే మహాయజ్ఞంలో విశాఖ పోర్టుతో సహా నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వ్యవస్థలను భాగస్వాములను చేస్తామన్నారు. పర్యావరణం పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచడానికే తాను సైకిల్ మీద ప్రయాణిస్తున్నానని, సైకిలింగ్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక దినచర్యగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం నగరంలో ప్రత్యేకంగా సైకిలింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ఉత్సాహంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవోటెల్ వరకు 5.5 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకుని యువతను సైతం ఆశ్చర్యపరిచారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా దారిపొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన సైకిల్ తొక్కారు. ఈ సైకిల్ ర్యాలీలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో పెను విషాదం..

- సిలిండర్ పేలి ముగ్గురి మృతి

**జయభేరి, నల్గొండ, జూన్ 5:**

మిర్యాలగూడలో పెను విషాదం చోటుచేసుకుంది. ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురు కుటుంబసభ్యులు సజీవ దహనం అయ్యారు. అమ్మమ్మ, మనవడు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యాభర్తలు. సైదులు అనారోగ్యం కారణంగా నెల రోజుల క్రితం చనిపోయాడు. చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. దీంతో ధనమ్మ తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్(16), ప్రణతి(14)తో పుట్టింట్లోనే ఉంటోంది. మూడు రోజుల క్రితం ఇళ్లలో పని చేసేందుకు పుణె వెళ్లింది. గురువారం రాత్రి చంద్రకళ.. మనవడు, మనవరాలితో ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్ అయింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ముగ్గురూ మంటల్లో చిక్కుకుని సజీవ దహనం అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయకచర్యలు చేపట్టారు.

# ప్రాంతీయ పార్టీలకు ఏమౌతోంది..?



రాజకీయ పార్టీలు సిద్ధాతాలు ప్రాతిపదికను కాకుండా కేవలం కొన్ని నిర్దిష్ట సమీకరణాల వల్లే ముక్కలవుతున్నాయని స్పష్టమవుతోంది. ప్రాంతీయ పార్టీలలో అత్యధికం కుటుంబ పార్టీలుగా మారడం వాటి పతనానికి ప్రధాన కారణం. అధినేత తర్వాత ఆ స్థానం వారసులకే దక్కాలనే పట్టుదల, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లలో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తోంది. మహారాష్ట్రో మహారాష్ట్రలో పవార్, బెంగాల్‌లో, యూపీలో యాదవ్ కుటుంబంలో జరిగిన గొడవలు దీనికి లైవ్ ఎగ్జాంపుల్స్ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు ప్రస్తుత రాజకీయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయనే మరో ఆరోపణ బలంగా ఉంది. అవినీతి కేసుల విచారణలు ఎదుర్కొంటున్న చాలా మంది నాయుకులు, తమ రాజకీయ ఉనికిని , ఆస్తులను కాపాడుకోవడానికి అధికార పక్షంతో, కేంద్రంలో ఉన్న పార్టీతో కలవడానికో, లేదా సొంత పార్టీని చీల్చడానికో సిద్ధపడుతున్నారు. ఆధునిక రాజకీయంలో భావజాలం అనేదానికి విలువ లేకుండా పోయింది. ఒకప్పుడు బద్ధశత్రువులుగా ఉన్న పార్టీలు కేవలంం అధికారం కోసం జత కట్టడం ఆ తర్వాత ప్రయోజనాలు నెరవేరకపోతే చీలిపోవడం సర్వసాధారణమైపోయింది. విపక్షాలకు కాలం చెల్లిపోలేదు. కానీ వారి పాత పద్ధతులకు మాత్రం కాలం చెల్లింది. వారసత్వ రాజకీయాలు, ద్వితీయ శ్రేణి నాయకత్వం లేకపోవడం, కేవలం అధికార పక్షాన్ని తిట్టడమే ఎజెండాగా పెట్టుకవడం వల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతోంది. విపక్షాలు కేవలం ఎన్నికల పొత్తులపై కాకుండా, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడలి. అప్పుడే మళ్లీ ప్రజల ఆదరణను పొందగలవు. లేదంటే ప్రాంతీయ పార్టీల మనుగడ హిస్టరీగా మారిపోనుంది. ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం ప్రాణం లాంటిది. పాలకుల తప్పిదాలను ఎత్తి చూపుతూ, ప్రజల పక్షాన నిలబడాల్సిన విపక్షాలు నేడు భారత్ రాజకీయాల్లో ఉనికి కోసం పోరాడుతున్నాయి. ఒకప్పుడు ఢిల్లీ పీఠాన్ని శాసించిన శక్తులు, రాష్ట్రాల్లో దశాబ్దాల పాటు ఏక ఛత్రాధిపత్యం వహించిన ప్రాంతీయ పార్టీలు నేడు అంతర్గత కలహాలు, ఫిరాయింపులు, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్నాయి. ఢిల్లీ నుంచి దేశం అన్ని రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. అయితే విపక్షాల ఈ పరిస్థితికి కారణం ఏంటీ? ఇప్పుడు చోటు చేసుకుంటున్న పరిణామాలు పంపిస్తున్న సంకేతాలు ఏంటో చూద్దాం. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో తిరుగుబాటు చోటుచేసుకుంది. బుధవారం నాడు తిరుగుబాటు ఎమ్మెల్యేలు తామే అసలైన తృణమూల్ అని స్పీకర్‌కు లేఖ రాశారు. ఎక్కువ మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు ఉన్నందున పార్టీ అధికారం ఇప్పటికే మమత చేతుల నుంచి జారిపోయింది. తృణమూల్ గుర్తుపై గెలిచిన 80 మందిలో, 60 మంది ఇప్పుడు రెబెల్స్‌గా మారారు. ప్రతిపక్ష నాయకురాలు రీటబ్రత బెనర్జీ విలేకరుల సమావేశంలో, "మేము తృణమూల్ కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాము" అని అన్నారు. 2022లో మహారాష్ట్రలో ఇలాంటి పరిణామాలు ఎదురయ్యాయి. అప్పటి వరకు శివసేనలో నమ్మిన బంటుగా ఉంటూ వచ్చిన ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు చేశారు. ఉద్ధవ్ థాకరే శివసేన నుంచి మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు విడిపోయారు. వారి పిటిషన్ ఆధారంగా, ఎన్నికల సంఘం అప్పటి తిరుగుబాటు శిబిరాన్ని నిజమైన శివసేనగా ప్రకటించింది. షిండే నిజమైన శివసేన గుర్తించి 'బాణం, విల్లు' చిహ్నం లభించింది. బాలా సాహెబ్ థాకరే సృష్టించిన పార్టీ, ఆ పార్టీ చిహ్నం రెండూ థాకరే కుటుంబం నుంచి జారి పోయాయి. తర్వాత ఎన్సీపీలో చీలక వచ్చింది. శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్ మెజారిటీ ఎమ్మెల్యేలతో పార్టీని వీడి వేరు కుంపటి పెట్టారు. తమదై నిజమైన ఎన్సీపీ అంటూ ప్రకటించారు. దీంతో శరద్ పవార్ కూడా తన ఒరిజినల్ పార్టీని కోల్పోయారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో కూడా అదే సీన్స్ రిపీట్ అవుతున్నాయి. ఢిల్లీలో ఆప్ పరిస్థితి అలానే ఉంది. ఇప్పటికే మెజారిటీ ఎంపీలు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. తమకను ఆప్ ఎల్పీని విలీనం చేస్తున్నట్టు ప్రకటించారు. తర్వాత పంజాబ్ వంతు వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఎన్నికలకు మరెంతో కాలం లేనందున అలాంటి పరిస్థితి లేకుండా నేరుగా ఎన్నికల ముందే పార్టీ చీలిపోనుందని అంటున్నారు. సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతా దళ్ వంటి పార్టీలు తమ ఉనికి కోసం నిరంతరం పోరాడాల్సి వస్తోంది. లోక్‌జనశక్తి లాంటి పార్టీలు ఇప్పటికే కుటుంబ కలహాలతో చీలిపోయాయి. తమిళనాడులో ద్రవిడ రాజకకీయ చరిత్రలో అన్నాడీఎంకేకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే జయలలిత మరణం తర్వాత ఆ పార్టీ రెండుగా చీలిపోయింది. ఎడప్పాడి పళనిస్వామి, ఓ పన్నీర్ సెల్వం, శశికళ, టీటీవీ దినకర్ వర్గాలుగా విడిపోయారు. ఇలా విడిపోవడంతో తర్వాత ఎన్నికల్లో డీఎంకే భారీ మెజారిటీతో విజయం సాధించింది. ఇప్పుడు విజయ్ టీవీకే అధికారం చేపట్టిన తర్వాత ఒరిజినల్ అన్నాడీఎంకే విడిపోతోంది. చాలా మంది ఎమ్మెల్యే తిరుగుబాటుకు రెడీగా ఉన్నారు. ఇప్పటికే కొందరు రాజీనామా చేశారు. మరికొందరు చర్చలు జరుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇరప్పుడు ప్రతిపక్ష హోదా చుట్టూ తిరుగుతున్నాయి. గత ఎన్నికల్లో 175 స్థానాలకు కానూ కేవలం 11 స్థానాలకే పరిమితం అయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఇప్పుడు అసెంబ్లీలో తన గొంతు వినిపించడానికి న్యాయపోరాటం చేస్తోంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదా దక్కాలంటే పతి శాతం సభ్యులు ఉండాలి. అంటే రాష్ట్రంలో 18 సీట్లు సాధిస్తేనే ప్రతిపక్ష హోదా వస్తుందని కూటమి ప్రభుత్వ వాదన. కేవలం 11 సీట్లు ఉన్న జగన్ మోహన్ రెడ్డికి ఆ హోదా కల్పించలేమని స్పీకర్ కార్యాలయం స్పష్టం చేసింది. అయితే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వేరే విపక్షం లేదని ఏకైక విపక్షం తమదే కాబట్టి కచ్చితంగా ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందేనంటూ వైసీపీ పట్టుబడుతోంది. దీనిపై హైకోర్టులో కేసు విచారణ సాగుతోంది. తెలంగాణలో పదేళ్లపాటు తిరుగులేని శక్తిగా వెలిగిన బీఆర్ఎస్ నేడు అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కారు దిగి హస్తం గూటికి చేరేందుకు యత్నించారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే అని వారు చెబుతున్నా, అది బహిరంగంగా జరుగుతున్న ఫిరాయింపులుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఫిరాయింపులపై బీఆర్ఎస్ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పటికీ, అసెంబ్లీ స్పీకర్ ఇటీవల తీసుకున్న నిర్ణయం ఆపార్టీకి షాక్ ఇచ్చింది. సాక్ష్యాధారాలు లేవనే కారణంతో అనర్హత పిటిషన్లు కొట్టివేశారు. ఒకప్పుడు ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో ఇతర పార్టీలను బలహీన పరిచిన బీఆర్ఎస్ ఇప్పుడు అదే వ్యూహానికి బలైపోతోంది. ఫిరాయింపుల సమయంలోనే కవిత కూడా పార్టీకి షాక్ ఇచ్చింది. తన మాట చెల్లుబాటు కావడం లేదని తనను పట్టించుకోవడం లేదని తిరుగుబాటు జెండా ఎగరేశారు. దీంతో ఆమెపై అనర్హత వేటు పడటంతో టీఆర్ఎస్ పేరుతో సొంత పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ వేదిక ద్వారా తన తండ్రి పార్టీ ఓటర్లనే టార్గెట్ చేశారు.

## ఒక్క క్లిక్‌తో లక్షలు మాయం

వాయిస్ స్పూఫింగ్, ఫోటో మార్ఫింగ్, వీడియో ఎడిటింగ్ వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి కొత్త రకాల సైబర్ దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో అత్యంత వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల్లో 'హనీ ట్రాప్' ఒకటి. సోషల్ మీడియా వేదికగా అందమైన యువతుల ఫొటోలతో నకిలీ ఖాతాలు సృష్టించి అమాయకులను వలలో వేసుకోవడం ఈ మోసగాళ్ల ప్రధాన వ్యూహంగా మారింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి వేదికల ద్వారా ఫ్రెండ్ రిక్వెస్టులు పంపి, కొద్ది రోజుల్లోనే బాధితులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకుంటారు. మొదట స్నేహం, తర్వాత ప్రేమ, ఆపై నమ్మకం పేరుతో వారిని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకుంటారు. అంతటితో ఆగకుండా పెట్టుబడుల పేరుతో మరింత పెద్ద మోసాలకు తెరలేపుతారు. తక్కువ మొత్తంలో డబ్బు పెట్టుబడి పెడితే నాలుగు రెట్లు లాభాలు వస్తాయని నమ్మించి లక్షల రూపాయలు కాజేస్తున్నారు. కొంతమంది నేరగాళ్లు వీడియో కాల్స్ ద్వారా మరో అడుగు ముందుకేసి బాధితులను మానసికంగా బలహీనపరుస్తున్నారు. వీడియో కాల్‌లో తమ దుస్తులు విప్పుతున్నట్లు నటిస్తూ ఎదుటివారిని కూడా అలాంటి చర్యలకు ప్రేరేపిస్తారు. బాధితుడు తెలియక అలా ప్రవర్తించిన వెంటనే మొత్తం కాల్‌ను రికార్డు చేస్తారు. ఒకవేళ బాధితుడు సహకరించకపోతే అతని ఫొటో లేదా ముఖాన్ని అశ్లీల వీడియోలకు జతచేసి మార్ఫింగ్ చేస్తారు. అనంతరం ఆ వీడియోలను కుటుంబ సభ్యులకు, స్నేహితులకు పంపిస్తామని, సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరిస్తూ భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన ఒక ఘటన ఈ మోసాల తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఓ యువతి పేరుతో ఫోన్ కాల్ వచ్చింది. పరిచయం పెంచుకున్న అనంతరం పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి దశలవారీగా అతని నుంచి రూ.18 లక్షలు కాజేశారు. మోసాన్ని గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో ఫ్రీజ్ అండ్ హోల్డ్ ప్రక్రియ ద్వారా సుమారు రూ.9 లక్షలు తిరిగి పొందగలిగారు. వరంగల్ సైబర్ క్రైమ్ ఏసీపీ గిరి కుమార్ ప్రకారం, అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, ఫ్రెండ్ రిక్వెస్టులు, మెసేజ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరం. కొత్తగా పరిచయమైన వ్యక్తులతో వ్యక్తిగత, ఆర్థిక లేదా గోప్యమైన సమాచారాన్ని పంచుకోకూడదు. ఎక్కువ లాభాలు వస్తాయంటూ చెప్పే పెట్టుబడి అవకాశాలను నమ్మకూడదు. అలాగే అపరిచితులు పంపే లింకులను క్లిక్ చేయకూడదు. ముఖ్యంగా తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్‌ను స్వీకరించకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా హనీ ట్రాప్ లేదా ఇతర సైబర్ మోసాలకు గురైనట్లు అనుమానం వచ్చినా, భయపడి డబ్బులు పంపకూడదు.

వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలి లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. సమయానికి ఫిర్యాదు చేస్తే పోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి ప్రొఫైల్ నిజం కాకపోవచ్చు. ప్రతి ఫ్రెండ్ రిక్వెస్ట్ వెనుక స్నేహం ఉండకపోవచ్చు. కాబట్టి ఒక్క క్లిక్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించడం, అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా సైబర్ నేరగాళ్ల వల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు.



## డీకే శివకుమార్‌కు షాక్‌ల మీద షాక్‌లు

**జయభేరి, బెంగళూరు, జూన్ 5 :**

కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన 24 గంటలు గడవక ముందే సీఎం డీకే శివకుమార్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఉదయం రామలింగారెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారు. కాసేపటికే మునియప్ప అసంతృప్తి గళమెత్తారు. మరి కొంతమంది సీనియర్లు కూడా ఇదే బాటలో ఉన్నారని తెలుస్తోంది. శాఖల కేటాయింపు విషయంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రభుత్వంలో అసంతృప్తి స్వరాలు పెరుగుతున్నాయి. సీనియర్ నాయకుడు కేహెచ్ మునియప్ప తన ప్రస్తుత శాఖలో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు, మంత్రి రామలింగారెడ్డి కూడా శాఖల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కె.హెచ్. మునియప్ప మాట్లాడుతూ, తనకు పోర్ట్‌ఫోలియో మార్పు కావాలని పార్టీ నాయకత్వం ముందు డిమాండ్ చేసినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ ఇటీవల కర్ణాటక పర్యటన సందర్భంగా కూడా తాను ఈ అభ్యర్థన చేసినట్లు ఆయన చెప్పారు. తాను ఈ విషయాన్ని రాహుల్ గాంధీ, సోనియా గాంధీతో కూడా చర్చిస్తానని మునియప్ప అన్నారు . సీనియర్ నాయకులకు ప్రోటోకాల్, అనుభవం ఆధారంగా పోర్ట్‌ఫోలియోలను కేటాయించాలని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు సాంఘిక సంక్షేమం, వ్యవసాయం లేదా నీటిపారుదల శాఖలను కేటాయిస్తే ప్రజలకు మరింత మెరుగ్గా సేవ చేయగలనని పేర్కొంటూ, మునియప్ప ఈ శాఖల పట్ల తన ఆసక్తిని వ్యక్తం చేశారు. తాను గత మూడేళ్లుగా ఆహార, పౌర సరఫరాల శాఖను నిర్వహించానని, ఇప్పుడు మార్పు కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. శాఖల కేటాయింపు విషయంలో మంత్రి రామలింగారెడ్డి రాజీనామా అంశాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శుక్రవారం తెలిపారు. ఆ సీనియర్ కాంగ్రెస్ నాయకుడిని తన ఆప్తమిత్రుడిగా ఆయన అభివర్ణించారు.

**డి.కె. శివకుమార్ ఇంకా ఏం చెప్పారు?**

రామలింగారెడ్డి అభ్యంతరం తనకు కేటాయించిన శాఖ సంబంధించిందని, దీన్ని పరిష్కరిస్తామని శివకుమార్ అన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రామలింగారెడ్డి నా సహచరుడు, ఒక సీనియర్ నాయకుడు. ఆయనకు కేటాయించిన శాఖలో ఎక్కువగా ప్రయాణాలు చేయాల్సి వస్తోందని, ఆయనకు వేరే శాఖ కావాలని చెప్పారు. నేను ఈ విషయం ఆయనతో చర్చించి ఒక పరిష్కారం కనుగొంటాను. ఆందోళన చెందాల్సిన అవసరం ఏం లేదు." గతంలో, తనకు బెంగళూరు అభివృద్ధి శాఖ ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుల మంత్రిత్వశాఖ కేటాయించని రెడ్డి ఆరోపించారు. మాట తప్పినందునే తాను రాజీనామా చేస్తున్నాని అన్నారు.

# పాలమూరు జిల్లా తలరాతను మార్చే సందర్భం ఇది

- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో చేపట్టిన సాగు, తాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 26 లక్షల ఎకరాలకు నీరందించి జిల్లాను సస్యశ్యామలం చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు.



**జయభేరి, మహబూబ్‌నగర్ :**

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గత రెండు రోజులుగా ప్రధాన నీటి పారుదల ప్రాజెక్టుల్లో కొన సాగుతున్న పనులను ముఖ్యమంత్రి మంత్రులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిశీలించారు. అనంతరం ఆయన కొత్తూరు కరివెన రిజర్వాయర్ వద్ద మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు 90 టీఎంసీల నీటిని అందించగలిగితే అత్యంత కీలకమైన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. జిల్లాకు చెందిన పాలమూరుతో పాటు కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, జూరాల, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉండేదని వివరించారు.

"ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రధానమైన భూసేకరణ చేయకుండా గత ప్రభుత్వ హయాంలో నిధులను పంపులు, లిఫ్ట్‌లకే ఖర్చు చేశారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో రూ. 84,503 కోట్ల అప్పు చేస్తే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 30 నెలల్లో అసలు, వడ్డీ కలిపి రూ. 52,121 కోట్లు చెల్లించా" చెప్పారు. అప్పులు, వడ్డీ పోగా కొత్తగా ప్రాజెక్టుల కోసం రూ. 22 వేల కోట్లు ఖర్చు చేయగా అందులో రూ. 8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల కోసం ఖర్చు పెట్టామని, ఈ లెక్కన జిల్లాలోని ప్రాజెక్టులకు ఎక్కువ ఖర్చు చేసినట్టా తక్కువ ఖర్చు చేసినట్టా అని ప్రశ్నించారు. రాబోయే రెండేండ్లలో గరిష్ఠస్థాయిలో ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి ఇకనుంచి విడతల వారిగా ఒక ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేయాలన్న ఆలోచనతో ఉన్నాం. భూ సేకరణ పూర్తి కాకుండా ప్రాజెక్టులు ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ప్రధానంగా మరో 4 వేల ఎకరాల భూ సేకరణ జరగాల్సి ఉందని పేర్కొంటూ అవసరమైన నిధులను విడుదల చేస్తామన్నారు. రైతులు అడుగుతున్న ధరలో కొంత ఎక్కువైనప్పటికీ భూసేకరణ పనులను పూర్తి చేస్తామని చెప్పారు. "ఇప్పుడు పనులు పూర్తి చేయకపోతే చరిత్ర క్షమించదు. జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేయడానికి నీళ్లు నింపడానికి రిజర్వాయర్లు కూడా పూర్తి కావాలి. రిజర్వాయర్లకు సంబంధించి ఆగిపోయిన పనులను కూడా పునరుద్ధరించాల్సి ఉంది. రాబోయే రోజుల్లో ఎక్కడికక్కడ నీళ్లు నిలువ చేయడానికి అవసరమైన పనులను పూర్తి చేస్తాం" అని తెలిపారు.

కర్నాటక రాష్ట్ర సరిహద్దు వద్ద బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ కట్టుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని చెబుతున్నారని, ఈ విషయంలో తొందర్లోనే సాంకేతిక నిపుణులతో చర్చించి కర్నాటక ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని ముందుకు వెళతామని అన్నారు. "పెండింగ్ పనులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసుకుని వాటిని పూర్తి చేయడానికి అవసరమైన కార్యాచరణ రూపొందిస్తాం. జిల్లాను అభివృద్ధి చేసుకుందాం. ఆలోచనా విధానంలో వేర్వేరు దృక్పథాలు ఉండొచ్చు. కానీ జిల్లా అభివృద్ధి విషయంలో అంతా ఒక్కటిగా ఉండాలి" అని కోరారు. "పాలమూరు - రంగారెడ్డి నుంచి ఉద్దండాపూర్ వరకు ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ రావాలి. ఇప్పుడున్న పంపులు, లిఫ్ట్‌లు, కెనాళ్లు పూర్తి స్థాయిలో 2027 నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నాం. అక్కడి నుంచి లక్ష్మీదేవిపూర్ వరకు నీటిని తరలించే విషయంపై వచ్చే 6 నెలల్లో మరోసారి సమీక్షిస్తాం" అని పేర్కొన్నారు. "పాలమూరు ప్రాజెక్టుల పనులను పూర్తి చేయడానికి మా చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదు. నేను ప్రత్యేకించి ఈ ప్రాంతం వాడిని. నా బాధ్యతను మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తా. గడిచిన 20 ఏండ్ల చరిత్రలో ఎప్పుడూ చిన్న విషయంలో కూడా లాలూచీ పడిన సందర్భం లేదు" అని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ అనేక అవాంతరాలను అధిగమిస్తూ 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కేవలం మద్దతు ధర ప్రకటించి వడ్లు కొనుగోలు చేయకపోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి అవసరమైన యూరియా కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ నుంచి ఉత్పత్తి అవుతున్న యూరియా బయటి రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని, ఈ రాష్ట్ర అవసరాలకు కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి చెందిన నీటి హక్కులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గోదావరి జలాల్లో 968 టీఎంసీల నికర జలాల కేటాయింపులు ఉన్నాయని, ఈ జలాల విషయంలో చుక్క నీటి విషయంలో కూడా రాజీ పడే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. తెలంగాణకు జరిగిన కేటాయింపులు కచ్చితంగా రావలసిందేనని, 968 నికర జలాల లెక్క తేలిన తర్వాత సముద్రంలో కలుస్తున్న మిగులు జలాలపై చర్చిస్తామని అన్నారు. "వచ్చే డిసెంబర్ నాటికి కృష్ణా జలాలపై ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. పరిష్కారం కోసం ఆఖరు నిమిషం వరకు పోరాడుతాం" అని స్పష్టం చేశారు. "పక్క రాష్ట్రాలతో పంచాయతీలు కోరుకోవడం లేదని, పంచాయతీ కావాలా, పరిష్కారం కావాలా అంటే నాకు పరిష్కారమే కావాలని చెబుతాను. గోదావరి, కృష్ణా జలాల్లో చుక్క నీరు వదులుకోం. చిల్లర పంచాయతీలు మాట్లాడం. వ్యూహాత్మకంగా ప్రతి చుక్క కాపాడుకునే ప్రయత్నం చేస్తాం" అని నొక్కి చెప్పారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టడానికి మహారాష్ట్రతో సంప్రదింపుల ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ విషయంపై చర్చించడానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశామని మరోసారి గుర్తుచేశారు.



## ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముందస్తు జన్మదిన వేడుకలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 05 :**

యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి పాదాల వద్ద ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదినోత్సవం సందర్భంగా వేడుకలను ప్రముఖ వ్యాపార వేత్త, ఎన్నారై గౌలికార్ నర్సింగ్ రాజ్ ,టీటీడీ లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు వడ్లోజు వెంకటేష్, యాదగిరిగుట్ట మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గౌలికార్ అరుణ రాజేష్ తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతక ముందుకు బీర్ల అయిలయ్యకు గౌలికార్ ఫౌండేషన్ ద్వారా ఘనంగా స్వాగతం పలికి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున బాణసంచా వెలుగుల మధ్య,భారీ కేక్ ను కట్ చేశారు. అనంతరం మహిళలకు భారీ ఎత్తున చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్,వైస్ ఛైర్మన్ బరిగె రమ్యారాంచందర్,కౌన్సిలర్ బూడిద మధు,ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, పెల్లిమెలి లావణ్య శ్రీధర్ గౌడ్,బిట్లు సరోజ హరీష్, సాధునేని ధనలక్ష్మి మధుకర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గౌళికౌర్ అరుణరాజేష్, షరీఫ్, రహీమా, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి మాత పల్లకి సేవ

- అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మవారు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే దేవస్థానం ప్రధాన అర్చకుడు హరిశంకర శర్మ ఆధ్వర్యంలో ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో,సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవాలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నీతో వాసవి మాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, జిల్లా మాజీ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య, దోమ హరికాంత్ లతోపాటు స్థానిక ఆర్యవైశ్యులు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రధాన ధ్యేయం

- కౌకుంట్ల సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్
- కౌకుంట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి భూమి పూజ



**జయభేరి, దేవరకద్ర :**

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ అన్నారు. కౌకుంట్ల మండల కేంద్రంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ఆదేశాల మేరకే ఈ భూమి పూజ నిర్మాణ పనుల నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పాటుపడు తుందన్నారు. నిరుపేదల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కౌకుంట్ల మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, ప్రాథమిక చికిత్స, అత్యవసర సేవలు, తల్లిశిశు సంరక్షణ, సాధారణ వైద్య సదుపాయాలు మొదలగు అన్ని రకాల వైద్య సేవలు అందించాలన్న లక్ష్యం తోనే ఈ ప్రాథమిక ఆరోగ్య భవన నిర్మాణాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఇది కౌకుంట్ల మండల ప్రజల ఆరోగ్య భద్రతకు మరింత బలాన్ని కోరుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ కు సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు కిషన్ రావు, మండల తహసీల్దార్ సుందరాజ్,డీఈ లక్ష్మణ్, ఏఈ శివ, కరుణాకర్ రెడ్డి, మండల ఓబీసీ అధ్యక్షుడు అంజనేయులు, కొండన్న, బెందుల ప్రభు, కావలి మహేష్, ప్రసాద్ లతోపాటు గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పెద్దరాజమూర్ లో బడిబాట

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం పెద్దరాజమూర్ లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా (సి డబ్ల్యూ ఎస్ ఎన్)ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలను ప్రజలను, మహిళలను, అంగన్వాడీ టీచర్లను కలిశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు కే. శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య, ఉచిత విద్యా విద్యార్థులకు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు పిల్లలు పాఠశాలలో చేరారు. ప్రభుత్వ పాఠశాలకు పిల్లలు పంపండి.. మీ పిల్లలకు మంచి చదువు నేర్పించే బాధ్యత మాది..అని శంకర్ గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్రలో ఆర్యవైశ్య మహిళల పూజలు

- వాసవి మాత అమ్మవారికి ఒడిబియ్యం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో శుక్రవారం వాసవి మాత అమ్మవారికి స్థానిక ఆర్యవైశ్య మహిళలు ఒడి బియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహించారు. జస్ట్ అధికమాసం సందర్భంగా గత కొన్ని రోజులుగా 33 అమ్మవార్లకు స్థానిక ఆర్యవైశ్య మహిళలు ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సాంప్రదాయత్తులో నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆంజనేయస్వామి దేవాలయంలో ఉన్నటువంటి వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు అందరు వచ్చి అమ్మవారికి ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి నిత్యరాబడి రూ. 27.14 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయంలో శ్రీఆండాల్ అమ్మవారికి ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో శ్రీపాంచరాత్రాగ మన ప్రకారం కొండపైన అద్దాల మండపంలో ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మ వారికి మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

**యాదగిరీశుడికి నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీ సత్యనారాయణస్వా



మి వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగే శ్వరాల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నిత్యరాబడి..**

స్వామి వారికి శుక్రవారం నిత్య రాబడిలో భాగంగా రూ.27,14,674 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,57,600,బ్రేక్ దర్శనం ద్వారా రూ.2,08,200, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.1,44,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.3,09,900, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,57,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.51,232, ప్రసాద విక్రయం ద్వారా రూ.10,94,680,కల్యాణ కట్ట ద్వారా రూ.80,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



**శ్రీవారి సేవలో ట్రైనీ ఐఏఎస్ ల బృందం**

స్వామి వారిని ట్రైనీ ఐఏఎస్ బృందం దర్శించుకున్నారు. శుక్ర వారం యాదగిరిగుట్టకు వచ్చిన ట్రైనీ ఐఏఎస్ లు హరిప్రసాద్, సురేష్, సాయిశివాని, సచిన్, శ్రీకాంత్ రెడ్డి, పవన్ కుమార్ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామి వారి వారి లడ్డు ప్రసాదం,జ్ఞాపికను అందజేశారు.

## వినుకొండ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్

**జయభేరి, హైదరాబాద్, జూన్ 5 :**

వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫేక్ జీవోల వ్యవహారంలో గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సైబరాబాద్ పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. ఆయన తమిళనాడులోని కాంచీపురంలో తలదాచుకున్నట్లు అందిన పక్కా సమాచారంతో సైబరాబాద్ స్పెషల్ టీమ్ అక్కడికి చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకుంది. హైదరాబాద్‌కు తరలించి, వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కీలక నేత ఇలా పక్క రాష్ట్రంలో దొరకడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన గండిపేట పరిధిలో దాదాపు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు బొల్లా బ్రహ్మనాయుడు అండ్ గ్యాంగ్ స్కెచ్ వేసినట్లు పోలీసులు గుర్తించారు. నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు , ల్యాండ్ డాక్యుమెంట్లను సృష్టించి ఈ ల్యాండ్ కబ్జాకు తెరలేపారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఈ 10 ఎకరాల భూమి విలువ దాదాపు రూ. 1,500 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. ఇంత భారీ మొత్తంలో నకిలీ పత్రాలతో ల్యాండ్ గ్రాబింగ్‌కు పాల్పడటం సైబరాబాద్ పరిధిలోనే అతిపెద్ద భూకుంభకోణాలలో ఒకటిగా నిలిచిందిగండిపేట భూమికి సంబంధించిన నకిలీ దస్తావేజుల వ్యవహారంపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం రంగంలోకి దిగింది. ప్రాథమిక విచారణలోనే బొల్లా బ్రహ్మనాయుడు ప్రధాన సూత్రధారి అని తేలడంతో ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పోలీసులు తన కోసం వెతుకుతున్నారని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యారు. అయితే సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు ఆయనను కాంచీపురంలో ట్రేస్ అవుట్ చేసి అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలపై వరుసగా కేసులు నమోదువుతున్న తరుణంలో, ఇప్పుడు తెలంగాణలో కూడా కబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ కావడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

జయభేరి, తుర్కపల్లి, జూన్ 05 :



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర చీఫ్ ఫారెస్ట్ కాంజర్వేటర్ శరవణన్ ,రాష్ట్ర ఫారెస్ట్ కాంజర్వేటర్ శివల రాంబాబు లు అన్నారు. శుక్రవారం జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామ పరిధిలోని ఫారెస్ట్ భూముల్లో 5 ఎకరాల్లో 5000 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల నుండి భూమిని మానవ, జీవజాతులను కాపాడుకోవాలంటే చెట్లు నాటడమే ప్రత్యామ్నాయమని అన్నారు. ప్లాస్టిక్, యూస్ అండ్ త్రో ప్లాస్టిక్ ను నిషేధిస్తూ దారపు సంచులను, గోనె సంచులను వాడాలని అన్నారు. అడవుల రక్షణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు పర్టిక్యులర్గా ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అన్నదానికంటే ఎన్విరాన్మెంట్ అనేది మేజర్ ఫోకస్ అన్నమాట అని అన్నారు .మనకు ఏదైనా ఒక పక్క అభివృద్ధి కావాలన్నదే మనం చాలా ఆకాంక్ష ఉందని,అభివృద్ధి వల్ల వచ్చే నష్టాల్లో కొన్ని ఏమిటంటే ఎన్విరాన్మెంటల్ని మనకు మనం నాశనం చేసుకుంటున్నాము కాబట్టి పర్టికులర్ గా ఎన్విరాన్మెంటల్ మీద అవగాహన కార్యక్రమాన్ని ప్రజలందరికీ కల్పించాలని అన్నారు.గ్రామాల్లో ప్రతి ఒక్కరు బర్త్డే ల సందర్భంగా ఒక్క మొక్కను నాటాలని ప్రతి బర్త్డే కు ఒక మొక్క నాటడంతో పర్యావరణం కృషి చేసినట్టు అవుతుందని అన్నారు. మొక్కలు నాటడం కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచాలని అన్నారు. ప్రకృతి నీడ గాలి లాంటి పర్యావరణం చెట్లతోటే సాధ్యమవుతుందని అన్నారు. పర్యావరణంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, త్రాగు నీరును పొదుపు చేయాలని అన్నారు. రాబోవు కాలంలో నీటిని నిలువ చేసుకోవాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణం పై మొక్కలు నాటడం పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో అందరూ కృషిచేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. అందరూ కష్టపడితే మంచి ఫలితాలు తీసుకురావచ్చు అని అన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో ఉంచవచ్చని అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 1 నుండి 12వ తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ భాగస్వాములై రాబోవు తరానికి మంచి పర్యావరణ అందించాలంటే ప్రజలందరూ తమ తమ ఇండ్లలో మొక్కలను పెంచాలని అన్నారు. ప్రభుత్వం ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుంచి చెట్లు పెట్టే కార్యక్రమాన్ని చేస్తున్నారని అందుకు గ్రామాల్లో ఉన్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫారెస్ట్ లో పెట్టే మొక్కలను నాశనం చేయకుండా వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సుధాకర్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, ఎంపీడీవో గీతారెడ్డి, సర్పంచులు దొనికేని రేణుక వెంకటేష యాదవ్, జేరుపోతుల కరుణాకర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్ నాయక్, దత్తాయిపల్లి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శాలిని, తుర్కపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాములు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మల్లేశం, శ్రీనివాస్, ఏపీవో నారాయణ, ఉప సర్పంచ్ నూకల శ్రీనివాస్, వార్డు సభ్యులు చాడ కరుణాకర్ రెడ్డి, స్వప్న సంపత్, చైతన్య బాలకృష్ణ నాంసాని నరేష్, నల్ల సుగుణ, పిడుగు కరుణాకర్, వంగ కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ నారాయణరెడ్డి, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.




## ఘనంగా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బంది వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డికి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. అలాగే సాటి మున్సిపాలిటీ కౌన్సిలర్లు కూడా వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

## ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలు మిన్న




జయభేరి, తుర్కపల్లి, జూన్ 05 :

ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలు మిన్న అని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ లు అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఇబ్రహీంపురం కోనాపురం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లల్ని చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంత కుమారి, గీతా, వెంకటరెడ్డ, రాజశేఖర్, వీరస్వామి పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములు సమాజ సేవలో పాల్గొనాలి



జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 05 :

అయ్యప్ప స్వాములు సమాజ సేవలో పాల్గొనాలని ఎస్ ఏ ఎస్ ఎస్ నేషనల్ జనరల్ సెక్రెటరీ నాయిని బుచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలోని సురేంద్రపురి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో శబరిమల అయ్యప్ప సేవా సమాజం యాదాద్రి భువనగిరి జిల్లా ముఖ్య కార్యనిర్వాహకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాలాధారణ భక్తులకు అన్ని దేవాలయాల్లో ఉచిత దర్శన సౌకర్యం కల్పించాలని అన్నారు .గ్రామాల్లో ప్రజలను భక్తి భావం కలిగేలా కృషి చేయాలని అన్నారు. యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.ప్రతి గ్రామంలో ఉన్న గ్రామ దేవాలయాల్లో బుధవారం, శనివారం రోజుల్లో ధూపదీప నైవేద్యాలు చేసే విధంగా కృషి చేయాలని అన్నారు. సాస్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే మహత్తర కార్యక్రమాల కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అయిత రాములు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏబీ చంద్రశేఖర్, యాదాద్రి భువనగిరి జిల్లా కార్య నిర్వాహకుడు పెండెం శ్రీనివాస్ గురుస్వాములు ఎన్విడి, చంద్రగిరి, జహంగీర్, బొబ్బిళ్ళ మురళి, శివశంకర్, పెద్దగాని శ్రీనివాస్, మచ్చ నరసింహ సీత నరసింహ, బిక్షపతి గౌడ్, రాపాక స్వామి, బల్ల కాళిదాస్, మాణిక్యం, మల్లారెడ్డి, లక్ష్మయ్య, రమేష్, శ్రీనివాస్, వెంకట్ రమణ, శ్రీశైలం, సురేష్, సందీప్, పాండురంగం, సోములు రాజేష్ పాల్గొన్నారు.

## విద్యార్థి ఆత్మహత్య

జయభేరి, హయత్ నగర్ :



కోహెడ శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్న విద్యార్థి కోమటిరెడ్డి దేవేందర్ రెడ్డి(17), తండ్రి జలపతి రెడ్డి, హనుమకొండవాసి, కళాశాల నందు మొదటి సంవత్సరం MPC పూర్తి చేసి, (466/470 marks) రెండవ సంవత్సరం చదవడం కోసం ఈనెల రెండవ తేదీన అతని తండ్రి జలపతి రెడ్డి మధ్యాహ్నం సమయంలో వచ్చి కాలేజీ నందు దించి వెళ్ళినాడు. శుక్రవారం సాయంత్రం కళాశాలలో స్టడీ అవర్ అయిపోయిన తర్వాత భోజన సమయానికి అందరూ కింద ఉండగా, అందాజా రాత్రి 09.00 సమయం తర్వాత అతని రూమ్ లో ఉండే ముగ్గురు విద్యార్థులు స్టడీ అవర్ తర్వాత రూంకి వెళ్లి సరికి దేవేందర్ రెడ్డి బెడ్ షీట్ , టవల్ తో ఉరివేసుకొని ఉండటం చూసి, హాస్టల్ వార్డెన్ దగ్గరికి వచ్చి దేవేందర్ రెడ్డి బెడ్ షీట్ తో ఉరివేసుకున్నాడని తెలుపగా, వెంటనే వెళ్లి బ్రతికి ఉన్నాడేమో అని భావించి కిందికి దింపి, హయత్ నగర్ లోని నీలాద్రి హాస్పిటల్ తరలించగా, అక్కడ డాక్టర్ పరిశీలించి మరణించినాడని తెలిపినారు. ఇట్టి విషయంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము.

# తప్పుడు ఆరోపణలను ఉపేక్షించేది లేదు

- మున్సిపల్ కమిషనర్ వక్కాల శ్యాంసుందర్

జయభేరి, తొర్రూర్, జూన్ 5 :






సోషల్ మీడియాలో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదని తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ వక్కాల శ్యాంసుందర్ అన్నారు. శుక్రవారం పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత కొన్ని ఏళ్లుగా ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా, కొమ్ము దేవేందర్ అనే వ్యక్తి, విధులు నిర్వహిస్తూ, 2018 సంవత్సరంలో 1,28,000, రూపాయలను ప్రజల నుంచి వసూలు చేసిన పన్ను నుండి వాడుకొని అవినీతి అక్రమాలకు పాల్పడడంతో, ఇతని పై విచారణ చేపట్టిన అప్పటి అదనపు కలెక్టర్ ఇతన్ని విధుల నుండి తొలగించడం జరిగిందని, ఆయన పేర్కొన్నారు.

తొలగించిన తదుపరి కలెక్టర్ నుండి ఎలాంటి ఆదేశాలు లేకుండా ఆనాటి పాలకవర్గంతో తప్పుడు తీర్మానాన్ని ఏర్పరచుకున్నట్టు సృష్టించి 2025 వరకు జీతం తీసుకుంటూ కలెక్టర్ ఆదేశాలను బే ఖాతార్, చేస్తూ పనిచేస్తున్నాడని ఆయన తెలిపారు. తాను ఇక్కడ కమిషనర్ గా చార్జి తీసుకున్న అనంతరం ఇతని యొక్క అక్రమాలను, గుర్తించి గతంలో కలెక్టర్ తొలగించిన కూడా విధులు ఎలా నిర్వహిస్తాడని నేను వెరిఫై చేయగా, కమిషనర్ అనే గౌరవం లేకుండా నాపై దూషణలకు తెగబడ్డాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ కు ఇతని పై ఫిర్యాదు చేయగా ఇతని పూర్తిగా విధులకు రాకుండా చేయాలని చెప్పడంతో ఆనాటి నుండి విధులకు రాకుండా చేశామన్నారు. అనంతరం నా పై కక్ష సాధింపులకు పూనుకుంటూ సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తూ, నా యొక్క విధులకి ఆటంకం కలిగిస్తూ నా మనోభావాలు దెబ్బతీయడం, చేస్తున్నాడన్నారు. కావున ఈ విషయంపై కొమ్ము దేవేందర్ అనే వ్యక్తిపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసి, కొమ్ము దేవేందర్ పై చీటింగ్ కేసు నమోదు చేస్తామని, గతంలో తీసుకున్న జీతాన్ని కూడా రికవరీ చేయడం జరుగుతుందని కమిషనర్ తెలియజేశారు.

# కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జడ్జ్ లు

జయభేరి, పరకాల, జూన్ 05:



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పరకాల జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆవరణములో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పరకాల ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, చైర్మన్ జి. సాయి శరత్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ బి.శ్రీవల్లి శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ సాయి శరత్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అదేవిధంగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ శైలజ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, వాటిని కాపాడుకుంటే మనం ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూకట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. పకృతి పరిరక్షణ ద్వారానే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పరకాల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుకట్ల శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ పెద్ద బోయిన వేణు, వైస్ ప్రెసిడెంట్, బందెల స్వామి, వెంకటరమణ, జాయింట్ సెక్రెటరీ రాఘవేంద్ర శర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ ఏజీపీ లక్కం శంకర్, ట్రెజరర్, రాహుల్ విక్రం, సీనియర్ ఈసీ మెంబర్ వి చంద్రమౌళి, ఎక్స్క్యూటివ్ మెంబర్స్ ఎన్ పవన్, సీనియర్ న్యాయవాదులు, పున్నం రాజిరెడ్డి, వంటేరు రాజమౌళి, జి జగదీశ్వర్, పి నెహ్రూ నాయక్, ఎం శ్రావణ్ కుమార్, జి నరేష్ రెడ్డి, తోట పరమేశ్వర్, మెరుగు శ్రీనివాస్, డి రమేష్, పవన్, టి సురేష్, పి రాజేందర్, ఎన్ పవన్, చంద్రమోహన్, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి

జయభేరి, కాప్రా :



చర్లపల్లి డివిజన్‌కు చెందిన పలు కాలనీలలో ఎన్నో సంవత్సరాలుగా స్టార్మ్ వాటర్ డ్రైన్ వర్షాకాలంలో మురుగునీరు బయటకు వెళ్లక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని స్ట్రాం వాటర్ డ్రైన్ పనులకు నిధులు మంజూరు చేయించడంతో పాటు టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేయించారు. ఈ పనులు వేగంగా ప్రారంభమై సజావుగా కొనసాగేందుకు అవసరమైన సహకారం అందించాలని కోరుతూ, చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ భరత్ రెడ్డి గారిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చర్లపల్లి డివిజన్ ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని, పనుల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలని కోరారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే తమ లక్ష్యమని, చర్లపల్లి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా పాస్టర్ జాన్సన్ జన్మదిన వేడుకలు

జయభేరి, తొర్రూర్, జూన్ 5 :

ప్రేయర్ గాస్పల్ మినిస్ట్రీస్ పాస్టర్ జాన్సన్ జంగాల జన్మదిన వేడుకలను విశ్వాసులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన క్రీస్తు ప్రేమను చూపిన పాస్టర్ నిన్ను వలే నీ పోరుగు వానిని ప్రేమించు అన్న విధంగా పేద ప్రజలను ప్రేమించి తన పుట్టిన రోజున వారికి చక్కని ఆహారము అందించారు విశ్వాసులు ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు

## గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దాం

- దంతాలపల్లి ఎస్సై రవికుమార్

జయభేరి, దంతాలపల్లి, జూన్ 5 :

మండలంను గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దడం మా లక్ష్యమని దంతాలపల్లి ఎస్సై రవికుమార్ అన్నారు శుక్రవారం



స్థానిక పోలీస్ స్టేషన్ లో జరిగిన ప్రెస్ మీ ట్ లో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల బారినబడి యువత చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు, గంజాయి టెస్ట్ కిట్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినట్లుగా ఆయన తెలియజేశారు వెంటనే పరీక్ష నిర్వహించి గంజాయి సేవించిన వారి పై చర్య తీసుకుంటుంది కొరకు చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు గంజాయిని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని ఆయన అన్నారు

## ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జిగా ముష్యం శ్రీనివాస్ నియామకం

జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత వేగం చేకూర్చే లక్ష్యంతో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జిగా ముష్యం శ్రీనివాస్ ను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉండి, డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన ముష్యం శ్రీనివాస్, పార్టీ నాయకత్వం ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేస్తూ, పార్టీ కోసం కృషి చేస్తానని తెలిపారు.

# పరవాడలో వైస్సార్సీపీ "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమం

- **కూటమి ప్రభుత్వం కాదు దగా ప్రభుత్వం వైసీపీ నాయకులు విమర్శలు**

**జయభేరి, పరవాడ:**




రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు అనే నినాదంతో నిర్వహించిన నిరసన కార్యక్రమం పరవాడ లో ఘనంగా జరిగింది. పరవాడ మండల వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయం నుండు సంతబయులు వరుకు నిరసన ర్యాలీ తో వెళ్లి , మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి , అనంతరం సంతబయలు కూడలిలో మానవహారం చేసి ఎన్నికల ముందు పంపిణీ చేసిన బాండ్లు మరియు మ్యానిఫెస్టోలను దహనం చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ , అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి,విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హాజరు అయ్యారు.ఈ సందర్భంగా పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువత, మహిళాలు, రైతులకు మరియు వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాకపోవడంతో ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొందని, అమలు చేసిన అరాకొర పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఉదాహరణకు మహిళలకు ఉచిత బస్సు అది కూడా మహిళ యొక్క గౌరవం దిగజారి పోయే విధంగా అమలులోకి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారంలోనికి రాకముందు వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ వారికి ఐదు వేల నుండి పదివేల వరకు ఉద్యోగ భృతి ఇస్తామని తీరా గెలిచాక వాలంటీర్ వ్యవస్థనే తొలగించారని కొనసాగిస్తున్న సచివాలయ వ్యవస్థని పూర్తిగా భ్రష్టు పట్టించారని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకొని, సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. హామీలను పూర్తిగా అమలు అయ్యే వరకు వైఎస్ఆర్సిపి ప్రజల తరపున నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలికలు పైల శ్రీనివాసరావు, పరవాడ మండల ఎంపీపీ పైలా వెంకట పద్మ లక్ష్మి,జడ్పీటీసీ పి ఎస్ రాజు,వైస్సార్సీపీ సీనియర్ నాయుకులు,మాజీ సర్పంచ్ చుక్క రాము నాయుడు,మండల వైస్సార్సీపీ అధ్యక్షుడు కోన రామారావు మండలంలో గల వైయస్సార్ సీపీ మాజీ సర్పంచ్లు,ఎంపీటీసీలు,నాయుకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఏఐ ఎనాబిల్డ్ ఈసీడి స్క్రీనింగ్పై అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలందరికీ రెండు బ్యాచ్లుగా జడ్పీ గర్ల్స్ హై స్కూల్ లో ఏఐ ఎనాబిల్డ్ ఈసీడి స్క్రీనింగ్ 0. నుండి ఆరు సంవత్సరములు పిల్లలకు స్క్రీనింగ్ చేయుట గురించి అంగన్వాడీ కార్యకర్తలకు మండల లెవెల్ ట్రైనింగు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా వారు సిడిపిఓ వీ లలిత కుమారి, డాక్టర్ పి . హారిక ఐసిడిఎస్ సూపర్వైజర్స్ శ్యామల కుమారి,లక్ష్మి,రమణి, అప్పల నరసమ్మ మరియు ఇందిరా అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ట్రైనింగ్ లో భాగంగా సిడిపిఓ వీ లలిత కుమారి మాట్లాడుతూ నవచేతన మూడు సంవత్సరాలలోపు మెదడు 80% వృద్ధి చెందుతుంది కావున వారికి ప్రేమతో కూడిన ప్రేరణ ఉండాలి, 0.6 సంవత్సరాల పిల్లల కి సంరక్షణ మరియు ప్రేమతో కూడిన ప్రేరణ. ఆట. మాట.పాట కథలతో పిల్లలను.తల్లి తండ్రి కుటుంబం లో వారు సంరక్షించాలి, మరియు పిల్లల్లో జరిగే ఐదు అభివృద్ధిలు ఎలా అభివృద్ధి పరచాలని అంగన్వాడి సెంటర్లో ఈసీసీ ద్వారా మెరుగుపరచాలని చెప్పారు అలాగే డాక్టర్ పి హారిక సున్నా నుండి ఆరు సంవత్సరాల పిల్లలు అందరిని 5 ఏళ్ళ లోపు అభివృద్ధిపై స్క్రీనింగ్ ఎలా చేయాలి అన్నది వివరిస్తూ చెప్పారు.




## శామీర్‌పేట్ సీఐ నరసింహారెడ్డికి వంగ వెంకట్‌రెడ్డి సన్మానం

**జయభేరి, మేడ్చల్ :**

శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొండ నరసింహారెడ్డిని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వంగ వెంకట్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు శాఖలో ఆయనకు ఉన్న అనుభవంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. సీఐ నరసింహారెడ్డి ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

## పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో మొక్కలు నాటిన ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి..**

**జయభేరి, మేడ్చల్ :**



పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కండ్లకోయ ఫారెస్ట్ లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ తో మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు.

అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి మనకు ప్రసాదించిన అమూల్యమైన సంపదను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించవచ్చన్నారు. "మనం నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు జీవన భరోసా అవుతుందని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి ఎంపీ ఈటల తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ సమతౌల్యం కాపాడటంలో చెట్ల పాత్ర కీలకం:- ఎమ్మెల్యే మల్లారెడ్డి**

పర్యావరణ సమతౌల్యం కాపాడటంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని మేడ్చల్ ఎమ్మెల్యే మాజీమంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. రోజు రోజుకీ పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న అడవుల వల్ల వాతావరణ మార్పులు తీవ్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ఎంతో అవసరమని సూచించారు. గత బిఆర్ఎస్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి దొరకడమే కష్టంగా మారుతుందని ప్రజలు ముందు జాగ్రత్తగా స్వచ్ఛందంగా మొక్కలు నాటలని కోరారు.



## ఘనంగా నరేంద్ర మోదీ 12 సంవత్సరాల ప్రస్థాన వేడుకలు

**జయభేరి, మేడ్చల్ :**

పచ్చదనంపరిరక్షణే ధ్యేయంగా, దేశ పురోభివృద్ధిలో మైలురాయిగా నిలిచిన గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ 12 సంవత్సరాల ప్రస్థానం మరియు ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని బీజేపీ గుండ్లపోచంపల్లి 299వ డివిజన్ అధ్యక్షులు కావేరీ శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో దూసుకుపోవడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి ఆధారిత జీవన విధానానికి భారత దేశం ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. 12 సంవత్సరాల అద్భుత ప్రస్థానానికి గుర్తుగా, భావితరాలకు పచ్చని, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో అభినందనీయం" అని కొనియాడారు. ప్రకృతిని రక్షించడం అంటే మనల్ని మనం రక్షించుకోవడమేనాని వారు తెలిపారు,నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలి, నాయకులు కోరారు, ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అమరం మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జును, మాజీ ఎంపీటీసీ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జె కృష్ణ, చింతలపూడి రామారావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అభిలాష్, శ్రీనివాస్ రావు దతితరులు పాల్గొన్నారు.

## ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం




**జయభేరి, మేడ్చల్ :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎల్లంపేట్ మున్సిపాలిటీలో మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల్లో స్వచ్ఛమైన, హరిత వాతావరణంపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ చెట్లు పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గాలి నాణ్యత మెరుగుపరచడం, జీవ వైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో మొక్కల ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని శ్రీదేవి పిలుపునిచ్చారు. పట్టణాన్ని మరింత హరితమయం చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ మొక్కల నాటే కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్పీ మంటగల్పి దేశపాత్రునిపాలెం దుర్గా వైన్స్ దోపిడీ

- **అధిక రేట్లకు మద్యం లక్షల్లో అక్రమ లాభాలు**

**జయభేరి, పరవాడ :**



పరవాడ మండలం జీవీఎంసీ 79 వ వార్డు దేశపాత్రునిపాలెంలోని దుర్గా వైన్స్ యాజమాన్యం ఎంఆర్పీ ధరలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూలినాలి చేసుకుని బతికే పేదల పొట్ట కొడుతూ లక్షల్లో అక్రమ లాభాలు దండుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.దుర్గా వైన్స్‌లో కూలింగ్ పేరుతో , బీరుపై రూ.10 నుంచి రూ.15 వరకు ఎంఆర్పీ కంటే అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బుతో సాయంత్రం మద్యం తాగేందుకు వస్తే, అధిక రేట్లతో తమ జేబులు గుల్ల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పేద కుటుంబాల్లో ఆర్థిక భారం పెరిగి, ఇంట్లో గొడవలకు దారితీస్తోందని స్థానికులు చెబుతున్నారరు. ప్రభుత్వ నాయకులు మాకు అండగా ఉన్నారు. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు అంటూ యాజమాన్యం బెదిరింపులకు దిగుతోందని, భయభ్రాంతులకు గురి చేస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.అక్రమ వసూళ్లపై ఎక్సైజ్ శాఖకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కళ్లుండి కబోదిలా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. తనిఖీల పేరుతో వచ్చిన అధికారులు మామూళ్ల మత్తు'లో జోగుతున్నారని, అందుకే వైన్ షాప్ యాజమాన్యం ఇష్టానుసారం దోపిడీకి పాల్పడుతోందని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ అధికారులు స్పందించి దుర్గా వైన్స్‌పై ఆకస్మిక దాడులు నిర్వహించాలని, ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.



## ఘనంగా బిఆర్ఎస్ నాయకుడు మద్దుల జన్మదిన వేడుకలు

**జయభేరి, మేడ్చల్ :**

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మద్దుల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. శుక్రవారం అభిమానులు కార్యకర్తలతో కలిసి యాద్రాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకున్నా మద్దులను వేదం పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం మాజీమంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన ముద్దుల కు మల్లారెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా మద్దుల శ్రీనివాస్ రెడ్డి ప్రజలలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అభిమానులు, కార్యకర్తల మధ్య ఎంతో ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు. మద్దుల శ్రీనివాస్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ ప్రత్యేక పోక్సో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నంబర్ 690/2023 కేసులో నిందితులైన ఇద్దరిని కోర్టు దోషులుగా తేల్చి జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో భారతీయ శిక్షాస్మృతి (IPC) సెక్షన్ 376(DB), 354(A)తో పాటు పోక్సో చట్టం 2012లోని సెక్షన్ 5(g), 5(m) రీడ్ విత్ 6, అలాగే 11 రీడ్ విత్ 12 కింద విచారణ జరిగింది. మేడ్చల్‌లోని ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీ కె. వెంకటేష్ శుక్రవారం తీర్పు ప్రకటించారు. నిందితులు శివకుమార్ (42), శామ్యూల్ అలియాస్ సమేల్ (19)లను కోర్టు దోషులుగా నిర్ధారించింది. వీరికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక సంవత్సరం సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. అదేవిధంగా బాధితురాలికి జిల్లా న్యాయ సేవా సంస్థ (DLSA) ద్వారా రూ.5 లక్షల పరిహారం అందించాలని కోర్టు పేర్కొంది. నిందితులు ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలో నివాసం ఉంటుండగా, వీరి స్వస్థలం కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా చత్రసాల ప్రాంతంగా పోలీసులు తెలిపారు.

## మాదక ద్రవ్యాలపై వ్యతిరేక అవగాహన కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**




పరవాడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈరోజు వెన్నెలపాలెం గ్రామంలో అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా పరవాడ సీఐ ఆర్. మల్లికార్జున రావు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. గంజాయి సేవించడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా విద్య, ఉపాధి మరియు కుటుంబ జీవితంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువత నేరాల వైపు ఆకర్షితులయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా, నిల్వ ఉంచుతున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల ఫోన్ కాల్స్, ఓటీపీలు, అనుమానాస్పద లింకులు మరియు పెట్టుబడి మోసాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పైల సన్యాసిరావు, పైల వరలక్ష్మి, బండారు అయ్యప్పనాయుడు, లోకిరెడ్డి అభినాయుడు తదితర గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖలో సైకిల్ తొక్కిన సీఎం

**జయభేరి, విశాఖపట్నం :**

సీఎం చంద్రబాబు ఏయూ క్యాంపస్ నుంచి నోవోటెల్ హోటల్ వరకు సైకిల్ పై వెళ్లారు. ముఖ్యమంత్రితో పాటు సైకిల్ ర్యాలీలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవరం సందర్భంగా విశాఖ వీధుల్లో సైకిల్ ర్యాలీ ముఖ్యమంత్రి చెపట్టారు. తిరుగు ప్రయాణంలో కూడా సైకిల్ మీదే హెలీప్యాడ్ కు సీఎం చంద్రబాబు వెళ్లారు.

# చెట్లలను నాటండి పర్యావరణాన్ని రక్షించండి

- సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి

జయభేరి, పరవాడ:

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరవాడ ఫార్మాసిటీలో సిఐటియు ఆధ్వర్యంలో పర్యావరణాన్ని కాపాడుకుందాం, పర్యావరణాన్ని పరిరక్షించండి నినాదాలు చేస్తూ ఐఓసీ జంక్షన్ నుండి టొరంటో ఫార్మా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రకృతి పై మనకి ఎంత హక్కు ఉందో దీనిని పరిరక్షించవలసిన బాధ్యత కూడా అంతకుమించి ఉందని ప్రకృతి స్ఫూర్తితో, వాతావరణం కోసం, మన భవిష్యత్తు కోసం ప్రజలంతా ప్రకృతిని కాపాడాలని కాపాడుకోవడానికి మనం అందరం ఉద్యమించాలని గని శెట్టి పిలుపునిచ్చారు. పరవాడ ఫార్మా పరిశ్రమల నుండి విడుదల అవుతున్న వ్యర్థ రసానికి జలాలను చెరువుల్లోకి కాలువల్లోకి గడ్డల్లోకి విడుదల చేయడం వలన భూగర్భ జలాలను నాశనం అవుతున్నాయని మరోవైపు అనేక జీవరాసులు కాలుష్యం వలన నాశనం అవుతున్నాయని దీని కాపాడవలసిన ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలను గాలికి వదిలేస్తున్నారని గని శెట్టి అన్నారు. సముద్రంలో ఏ విధమైన శుద్ధి చేయకుండా ఫార్మా గద్ద రసాన్నిక జలాలను విడుదల చేయడం వలన సముద్రంలో విలువైన జీవరాసులు నాశనం అవుతున్నాయని దీని పరిరక్షించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు సక్రమమైన పద్ధతుల్లో పర్యవేక్షణ లేకపోవడం వలన ఢిల్లీ తర్వాత భారత దేశంలో పరవాడ ప్రాంతం తీవ్రమైన కాలుష్యంలో చిక్కుకున్నదని ఉందని గన్శెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఫార్మా పరిశ్రమలో ప్రతి ఆరు నెలలకి ఆడిట్ నిర్వహించాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యాలపై ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆయన కఠినమైన చర్యలు తీసుకొని కాలుష్యం అరికట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కే పోతి నాయుడు, చిన్నారావు, సత్తిబాబు, అప్పారావు, కృష్ణ, దారా బాబు తదితరులు పాల్గొన్నారు.






## మానవ మనుగుడకు మొక్కలే ముఖ్యం

- విశాఖ ఫార్మాసిటీ ఎం.డి., సీఈవో హీరాలాల్ సమారియా

జయభేరి, పరవాడ:

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖ ఫార్మాసిటీలో రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1450 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమారియా మాట్లాడుతూ మొక్కలు లేకుంటే పర్యావరణంలో విపరీతమైన మార్పులు సంభవిస్తాయన్నారు. అతి చలి, అతి వేడి, అతి వర్షాల వంటి దుష్ప్రభావాలు మానవ జీవనశైలిని అతలాకుతలం చేస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆక్సిజన్ కొనుగోలు చేయవలసిన పరిస్థితి ఏర్పడతుందన్నారు. దేశంలో సామాజిక బాధ్యత కొరవడి, విచ్చలవిడిగా చెట్లు నరికివేయడం, వాటిని విచ్చలవిడిగా విసిరివేయటం వల్ల కాలుష్యం పెరిగిపోతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామ్‌కీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.ఆర్.నాగరాజ మాట్లాడుతూ మొక్కల పార్మాసిటీలోని ప్రతి ఉద్యోగి ఒక బాధ్యతగా తీసుకొని చిన్న చిన్న బ్లాక్‌లలో మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని సూచించారు. మన చిన్నప్పుడు ఉన్న చింతచెట్లు, వేపచెట్లు, సీమచింత చెట్లు పూర్తిగా కనుమరుగవుతున్నాయని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెసిప్స్ లేబరేటరీ పర్యవేక్షణ అధికారి మోహన్, కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ హెడ్ సాంబశివరావు, విశాఖ ఫార్మాసిటీ డిజిఎం గిరిధర్ భక్షి, లైజనింగ్ ఆఫీసర్ రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కే.శ్రీకాంత్, పార్మాసిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విలేజ్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి సొసైటీ




జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని Village Development Society వారి ఆధ్యర్యంలో ఏర్పాటు చేసిన Computer Application And Training Garment Making Trailoring Embroidery And Beauty Wellness Skill Training ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాయకులు జాలే నరసింహారెడ్డి పీసీసీ సభ్యులు, PACS చైర్మన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి అనేది గ్రామాల్లోని ప్రజలు ఆర్థిక సామాజిక మౌళిక వసతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ప్రక్రియ అన్నారు. అదే విధంగా నేటి కాలంలో బ్యూటీషియన్ శిక్షణ అనేది కేవలం మేకప్ లేదా హెయిర్ స్టైలింగ్ కు మాత్రమే పరిమితం కాలేదు ఒక విజయవంతమైన సెలూన్ నిర్వహించడానికి కంప్యూటర్ అప్లికేషన్స్ వస్తుతయారీ నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా మీ వ్యాపారాన్ని త్వరగా అభివృద్ధి చేసుకోవచ్చు అని అన్నారు. అదే విధంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ యొక్క శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది అని తెలిపారు ఈ యొక్క కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఫౌండర్స్ రామయ్య, ప్రమీలకు ప్రత్యేక అభినందనలు, ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, జాతీయ అవార్డు గ్రహీత భాషా చౌహాన్, శిక్షణా నేర్పించినవారు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి SBI BANK లో భారీ కుంభ కుంభకోణం




జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం SBI BANK లో భారీ కుంభ కుంభకోణం సుమారు 70 లక్షల కి టోపీ పెట్టిన SBI బ్యాంకు అధికారులు చింతపల్లి మండలం అజినాపురం గ్రామానికి చెందిన సుమారు 20 మంది బాధితులు మూడు ఎకరాల భూమి లేకపోయినా భూమి ఉన్నట్లుగా సుమారు భూమి పట్టా పాస్ బుక్కులు తయారు చేసి వాళ్ల పేర్లు మీద ఒక్కొక్కరు మీద మూడు ఎకరాల భూమి సుమారు 20 మంది బాధితుల పై ఒక్కొక్కరి మీద 1,50,000 వరకు డ్రా చేసినట్లు బ్యాంకు అధికారులు సుమారు 45 నుండి 50 మంది వరకు బాధితులు ఉన్నారని వింజమూర్, వెంకటం పేట, నేలువలపల్లి సర్వే నెంబర్లలో బాధితుల ఇంటికి నోటీసులు రావడంతో లబోదిబో అంటూ ఎస్బిఐ బ్యాంకు వద్దకు వెళ్లి బ్యాంకు మేనేజర్ నిలదీయడంతో గత మేనేజర్ చేసిన మోసం కావచ్చు మేం పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాము మీకు ఎలాంటి ప్రాబ్లం ఉండదని బాధితులకు వివరించి చెప్పిన బ్యాంకు మేనేజర్.

## దేవ్ జీని పరామర్శించిన కవిత

జయభేరి, మేడ్చల్ :

అనారోగ్యంతో బాధపడుతున్న మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ని న తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. కొంపల్లిలోని ఒక హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న దేవ్ జీ ని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందిస్తున్న చికిత్స గురించి డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ఈదులపల్లి, మోత్కులగూడ గ్రామాలలో హైమాస్ట్ లైట్స్ ప్రారంభోత్సవం

- ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు పట్ల సంతోషం వ్యక్తం చేసిన గ్రామస్తులు

జయభేరి, షాద్ నగర్, జూన్ 05 :



ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో నందిగామ మండలం ఈదులపల్లి మోత్కులగూడ గ్రామాలలో హైమాస్ట్ లైట్లను గురువారం సాయంత్రం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గ్రామ ప్రజల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామాలకు అవసరమైన వసతుల ఏర్పాటులో గ్రామాలో ఉన్న సమస్యల నిర్మూలనకు తోడ్పాటు అందిస్తానని అన్నారు. తమ గ్రామంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అవసరమైన హైమాస్ట్ లైట్లు సొంత నిధులతో ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని ఘనంగా సన్మానించి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈదులపల్లి సర్పంచ్ బంటారం సులోచన గణేష్‌గౌడ్, ఉపసర్పంచ్ శేఖర్, సంధ్యారాణి, మోత్కూలగూడ సర్పంచ్ లావణ్య రమేష్, ఉపసర్పంచ్ నర్సిములు, వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు, శ్రీనివాసులగూడ సర్పంచ్ కుమ్మరి పద్మమ్మక్రిష్ణయ్య, నాగులపల్లి సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి, మోత్కులగూడ మాజీ సర్పంచ్ నర్సింలు, మామిడిపల్లి మాజీ ఎంపిటిసి కాట్నా రవీందర్, వీర్లపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల నర్సిములు, గౌడ్, మోత్కూగూడ ఉపసర్పంచ్ నర్సిములు, ఈదులపల్లి వార్డు మెంబెర్స్, మామిడిపల్లి కుమారస్వామి, అనూష శ్రవణ్ గౌడ్, బంటారం శ్రీధర్, జినుకుంట హనుమంతు, వడ్ల మౌనిక ప్రవీణ్, మోత్కూలగూడ వార్డ్ మెంబెర్స్ లక్ష్మి, నగేష్, సంతోష, నరేష్, లక్ష్మమ్మ, రమేష్, శైలజ.బీఆర్ఎస్ నాయకులు జయరాం గౌడ్, బాలయ్య, శ్రీను, రాంరెడ్డి చెన్నకేశవులు, బాలరాజ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## వాసవి క్లబ్, వాసవి వనిత గ్రేటర్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

జయభేరి, దేవరకొండ :



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేవరకొండ బస్ ప్రయాణ ప్రాంగణములో వాసవి క్లబ్, వాసవి వనిత గ్రేటర్ దేవరకొండ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమములో వాసవి క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి, ఐపీసీలు గోవిందు కొండయ్య, బెలిదే మాధవిలు మాట్లాడుతూ.. పర్యావరణమును మనమే చేజేతులా ప్లాస్టిక్ కాలుష్యము, వాయు కాలుష్యము, శబ్ద కాలుష్యము మొదలగు అనేక రకాల కాలుష్యములతో, చెట్లను కొట్టివేస్తూ అనేక రకాల కాలుష్యములతో నాశనము చేస్తున్నామని పర్యావరణమును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉన్నదని తెలియచేసినారు. ఈ సందర్భంగా కొండల్ మాస్టర్ ఆధ్వర్యంలో పర్యావరణం పై నృత్య ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు ప్రయాణికులకు మొక్కలను పంచి, వీటితో పాటుగా జ్యూట్ బ్యాగులను పంచడం జరిగింది. ఈ కార్యక్రమములో కార్యదర్శి బెజవాడ మల్లీశ్వరి, వాసవి క్లబ్ కార్యదర్శి బేలిదే మాధవి రవీందర్, కోశాధికారి పందిరి వెంకన్న, ప్రజా గాయకుడు పెంటోజి, మిరియాల స్వప్న వాసవి క్లబ్, వనితా క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు మంత్రి దృష్టికి

- హౌసింగ్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన పలు అంశాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :



ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన హౌసింగ్ మరియు రెవెన్యూ శాఖల పరిధిలో ఉన్న పలు అభివృద్ధి, ప్రజా సమస్యల అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని Dr BR Ambedkar సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు గృహ వసతి కల్పన, పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ సమస్యల పరిష్కారం, భూ సంబంధిత అంశాలు, రెవెన్యూ సమస్యలు, ప్రజల నుంచి వచ్చిన వినతులపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు BRS పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## HMC డాన్స్ స్టూడియో 5వ వార్షికోత్సవం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ HMC డాన్స్ స్టూడియో వారి 5వ వార్షికోత్సవం SPR దేవరకొండ స్కూల్లో అంగరంగ వైభవంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవరకొండ CI వెంకట్ రెడ్డి విచ్చేసినారు. సిఐ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజుల్లో విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలు కూడా ఎంతో ముఖ్యమని తెలియజేసినారు. మా మిత్రుడు ఏడుకొండలు డాన్స్ మాస్టర్ విద్యార్థులకు డ్యాన్సు స్కూలు ఎంతో నైపుణ్యంతో నేర్పిస్తున్నాడని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో SPR SCHOOL యాజమాన్యం శ్రవణ్, లింగం , మహేష్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు

- పేద ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయి
- ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జయభేరి, దేవరకొండ :

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం క్యాంపు అభినందనీయం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామంలో మునుకుంట్ల వెంకట్ రెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆయన సందర్శించి కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంపును ఏర్పాటు చేసిన మునుకుంట్ల వెంకట్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటి వ్యాధుల నివారణకు, ముందస్తు గుర్తింపుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు.అనంతరం క్యాంపు నిర్వాహకులు ముఖ్య ఆయన ను శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునికుంట్ల వెంకట్ రెడ్డి ,స్థానిక ఉప సర్పంచ్ కడారి సైదులు, బొడ్డుపల్లి కృష్ణ, వడత్య బాలు, అప్పనాల తిరుమల, గుండాల వెంకట్ యాదవ్,మల్లేష్ తదితరులుపాల్గొన్నారు.

## 13 ఏళ్ల బాలుడు గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి



జయభేరి, కొండమల్లేపల్లి :

పట్టణంలో విషాదం జరిగింది. ముక్కుపచ్చలారని 13 ఏళ్ల బాలుడు గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందడం అందరినీ కలిసివేసింది. పట్టణ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోట్ల జగదీష్ పటేల్ కుమారుడు కోట్ల జతిన్ కుమార్ అకస్మాత్తుగా గుండెపోటుతో చనిపోవడం దిగ్భ్రాంతికరం. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని కోరుకుంటూ...



# నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

**మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.**

### కొవ్వు కరుగుతుంది..


డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్ధకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి?

**జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి మనం తలకు నూనె రాస్తుంటాం. తలపై నూనెతో స్మూత్ గా మసాజ్ చేస్తే ప్రశాంతంగా అనిపిస్తుంది. జుట్టు కుదుళ్లు కూడా బలపడతాయి. జుట్టు చక్కగా పెరగాలంటే ఎన్ని రోజులకు ఒకసారి నూనె రాయాలి? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?**

మనం జుట్టుకు రెగ్యులర్ గా నూనె రాస్తుంటాం. దానివల్ల జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి? రోజూ రాయడం మంచిదా? లేక వారంలో ఒకటిరెండు సార్లు రాస్తే సరిపోతుందా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం.

### వారానికి 1-2 సార్లు

ఆరోగ్య నిపుణుల ప్రకారం జుట్టుకు వారానికి 1-2 సార్లు ఆయిల్ రాయడం మంచిది. సాధారణ లేదా డ్రై హెయిర్ ఉన్నవారు వారానికి రెండు సార్లు రాసుకోవచ్చు. ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారు వారానికి ఒకసారి జుట్టుకు నూనె రాస్తే సరిపోతుంది. దానివల్ల స్కాల్ప్ ఉత్పత్తి చేసే సహజ నూనెలపై చెడు ప్రభావం పడదు.

### రోజూ రాస్తే ఏమవుతుంది?

సాధారణంగా చాలామంది రోజూ నూనె రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ దానివల్ల హెయిర్ ఫోలికల్స్ బలహీనపడే అవకాశం ఉంది. అంతేకాదు దుమ్ము, ధూళి వంటివి తలపై చేరి చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చుండ్రు, ఇరిటేషన్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు ఎదురవుతాయి.

### నూనె వేడి చేసి రాస్తే..

ఆయిల్ వాడటం వల్ల జుట్టుకు హైడ్రేషన్ లభిస్తుంది. తలపై స్మూత్ గా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అయితే చాలామంది నూనెను కొద్దిగా వేడి చేసి జుట్టుకు అప్లై చేస్తుంటారు. గోరువెచ్చని నూనెతో తలపై మసాజ్ చేస్తే.. జుట్టులోకి సులభంగా ఇమిడిపోతుంది. అలాగే రక్తప్రసరణ మెరగవుతుంది. కానీ నూనెను ఎక్కువ వేడి చేయడం మంచిది కాదు. అదే విధంగా జుట్టుపై బలంగా రుద్దడం కూడా ప్రమాదకరం అని నిపుణులు సూచిస్తున్నారు.

### ఎక్కువసేపు ఉంచితే?

జుట్టుకు నూనె రాసిన తర్వాత మరీ ఎక్కువసేపు ఉంచకూడదు. 45 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉంచితే సరిపోతుంది. దానికంటే ఎక్కువసేపు ఉంచితే.. ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు.

### ఏ నూనె వాడొచ్చు?

నిపుణుల ప్రకారం జుట్టు రకాన్ని బట్టి నూనెను ఎంచుకోవాలి. పొడి జుట్టుకు కొబ్బరి నూనె వాడొచ్చు. కొబ్బరినూనె జుట్టు లోపలి వరకు చొచ్చుకుపోయే గుణాలను కలిగి ఉంటుంది. అలాగే మందపాటి జుట్టుకు బాదం నూనె, జుట్టు పెరుగుదలకు ఆముదం నూనె వంటివి వాడొచ్చు.





# జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

**జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.**

### 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యూరేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్ గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

### కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

### ముఖం స్లిమ్ గా కనిపించడం

జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

### ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మ రికవరీని వేగవంతం చేస్తాయి. సన్ డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

### ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



వింత పోకడలు, విచిత్రమైన అభిరుచులు మనుషుల్లో కామన్. బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఆహారపు అలవాట్లు వింటే మరీ విడ్డూరం అనిపించక మానదు. ఈ ముద్దుగుమ్మ అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తింటుందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని తానే స్వయంగా చెప్పింది. ‘ఈ అలవాటు నా ఫ్రెండ్ నుంచి నాకు వచ్చింది. తను ఓ సారి రైస్‌లో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడం చూశాను. చూసిన దాన్ని చూసినట్టుగా ఉండక, ఇంటికెళ్లి ట్రై చేశాను. నిజం చెబుతున్నాను.. ఆ టేస్ట్ చాలా కొత్తగా అనిపించింది. నిదానంగా అది అలవాటుగా మారింది. నాకు నచ్చిందని అందరికీ నచ్చాలని లేదు’ అంటూ చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్. ఇది విన్న వారంతా ‘అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడమేంటి?.. పిచ్చికాకపోతే..’ అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొందరైతే.. ‘ట్రై చేస్తే తప్పేంటి?’ అని కూడా అంటున్నారు. జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి అని ఊరికే అనలేదు!

# అదే అలవాటుగా మారింది!



# వైరల్ అవుతున్న తారక్ స్పందన!

టాలీవుడ్ స్టార్ హీరో, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా తన అభిమానులతో సరదాగా మమేకమవుతూ, అప్పుడప్పుడు వారి పోస్టులకు స్పందిస్తూ అందరి మనసులు గెలుచుకుంటుంటారు. తాజాగా ఎన్టీఆర్ చేసిన ఓ ఫన్నీ రిప్లై ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానులను తెగ ఆకట్టుకుంటోంది. ఎన్టీఆర్‌కు నటనతో పాటు వంట చేయడం కూడా ఎంతో ఇష్టమనే విషయం తెలిసిందే. గతంలో ఆయన చికెన్ బిర్యానీతో పాటు పలు రకాల వంటకాలు స్వయంగా తయారు చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అనేక ఇంటర్వ్యూలలో కూడా తన తల్లి దగ్గర నుంచే వంట నేర్చుకున్నానని, సమయం దొరికితే కిచెన్‌లో కొత్త కొత్త వంటకాలు ట్రై చేయడం తనకు చాలా ఇష్టమని తారక్ వెల్లడించారు.

తాజాగా ఎన్టీఆర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో తానే స్వయంగా తయారు చేసిన ‘చాక్లెట్ చిప్ కుకీస్’ వీడియోను అభిమానులతో పంచుకున్నారు. ఆ వీడియోకు “కొన్నవి కావు.. నేనే బేక్ చేశాను” అంటూ సరదా క్యాప్షన్ కూడా జత చేశారు. తన అభిమానులు ఈ వీడియోను చూసి ఆశ్చర్యపోతూ, తారక్‌లోని మరో టాలెంట్‌ను ప్రశంసించారు. అయితే ఈ వీడియో చూసిన ఓ అభిమాని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆసక్తికరమైన పోస్ట్ చేశాడు. “అన్నా.. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.. నాకు రెండు కుకీస్ కావాలి” అంటూ ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేస్తూ సరదాగా ట్వీట్ చేశాడు. సాధారణంగా స్టార్ హీరోలు ఇలాంటి పోస్టులను పట్టించుకోకపోవచ్చు. కానీ ఎన్టీఆర్ మాత్రం ఆ ఫ్యాన్ ట్వీట్‌ను గమనించి తనదైన శైలిలో స్పందించారు. ఆ అభిమాని ట్వీట్‌కు ఎన్టీఆర్ ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందంకు సంబంధించిన ఓ హిలేరియస్ మీమ్‌ను రిప్లైగా పెట్టారు. తారక్ ఇచ్చిన ఆ ఫన్నీ స్పందన అభిమానులను నవ్వుల్లో ముంచెత్తింది. సోషల్ మీడియాలో ఈ రిప్లై క్షణాల్లో వైరల్‌గా మారగా, అభిమానులు “ఇదే మా తారక్ స్పెషల్”, “స్టార్‌డమ్ ఎంత ఉన్నా అభిమానులతో ఇంత సింపుల్‌గా ఉండటం గొప్ప విషయం” అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ అభిమానులతో సరదాగా చేసిన ఈ చిన్న సంభాషణ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన వినయం, హాస్య చతురత, అభిమానులపై ఉన్న ప్రేమను మరోసారి చాటుకున్న తారక్.. ఈ ఫన్నీ రిప్లైతో నెట్టింట ట్రెండింగ్‌లో నిలిచారు. అభిమానులతో ఆయనకు ఉన్న ప్రత్యేక అనుబంధం మరోసారి స్పష్టమైందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# అగ్ని.. విశ్వం త్యాగం వెరసి రాకా




‘పుష్ప’ ఫ్రాంచైజీతో పానిండియా ఇమేజ్‌ని సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో ‘రాకా’ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ‘పుష్ప2’ తర్వాత వస్తున్న సినిమా కావడంతో, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అత్యంత ప్రతిష్టాత్మకంగా సన్ పిక్చర్స్‌వారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు అట్లీ తనదైన శైలి మాస్ ఎలిమెంట్స్‌కు ఎమోషన్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్, సైన్స్ ఫిక్షన్‌ను జోడించి ఈ కథను తయారు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచింది. త్వరలో గ్లింప్స్ కూడా విడుదలయ్యే అవకాశం ఉంది. రాకా ప్రపంచాన్ని, దాని విజువల్ స్కేల్‌ని ఈ గ్లింప్స్ ద్వారా పరిచయం చేయనున్నారు. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా గురించి ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. ‘రాకా’ కథ పునర్జన్మల నేపథ్యంలో సాగుతుందట. మూడు కాలాల్లో నడిచే ఈ కథలో అల్లు అర్జున్ మూడు రకాల భిన్నమైన పాత్రల్లో కనిపిస్తారట. ‘అగ్ని.. విశ్వం.. త్యాగం..’ ఈ మూడింటి చుట్టూనే ఈ సినిమా కాన్సెప్ట్ నడుస్తుందని తెలిసింది. షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా జరుగుతున్నాయి. వీఎఫ్ఎక్స్ కీ రోల్ పోషించే ఈ చిత్రంలో దీపిక పదుకోణ్ కథానాయిక కాగా, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన్నా ప్రత్యేక పాత్రల్లో మెరవనున్నారని సమాచారం.

# ‘పెద్ది’ మేకర్స్‌పై సింగర్ ఆగ్రహం..

## జాన్వీ కపూర్‌ను ఒక వస్తువుగా చూపించారంటూ విమర్శలు!





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన స్పోర్ట్స్ డ్రామా ‘పెద్ది’ చిత్రం ఒకవైపు బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తున్నప్పటికీ, మరోవైపు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. ఈ చిత్రంలో హీరోయిన్ జాన్వీ కపూర్ పోషించిన ‘అచ్చియమ్మ’ పాత్రను అతిగా గ్లామరైజ్ చేయడం, ఆమెను కేవలం ఒక వస్తువులా చిత్రీకరించడంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజాగా ఈ వివాదంపై ప్రముఖ గాయని సుమంగలి అరియనాయగం ఘాటుగా స్పందించింది. చిత్ర మేకర్స్ ప్రవర్తించిన తీరును తప్పుబడుతూ ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టింది. బలహీనుల ఆవేదన, అణచివేత చుట్టూ కథను అల్లుకున్న చిత్ర బృందం, అదే గౌరవాన్ని జాన్వీ కపూర్ పాత్రకు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని ఆమె మండిపడింది.

‘అధికారం లేని సగటు మనుషుల ఆవేదన, అణచివేత చుట్టూ కథను అల్లుకోవడానికి ఒక గది నిండా శక్తివంతమైన పురుషులు కూర్చున్నారు. కానీ దురదృష్టవశాత్తూ, అదే సమయంలో వారు జాన్వీ కపూర్ పాత్రను కేవలం కెమెరా ముందు ప్రదర్శించే ఒక శరీరంగా, బలవంతపు ముద్దు సీన్ కోసం వాడుకునే ఒక ప్రాప్‌గా మార్చేశారు. కేవలం పాటలు ముగిసేవరకు మాత్రమే పరిమితమయ్యేలా ఆమె పాత్రను వాడుకొని వదిలేశారు.

వారికి మానవ గౌరవం అంటే ఏమిటో బాగా తెలుసు, కానీ ఆ గౌరవానికి జాన్వీ కపూర్ అర్హురాలు కాదని వారు నిర్ణయించుకున్నారు’ అంటూ సుమంగలి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది.

# సినిమా హీరోయిన్స్‌కు మించిన క్రేజ్..

మోడ్రన్ డ్రెస్సులలో గ్లామర్ ఫోటోషూట్లతో ఫాలోయింగ్ పెంచుకుంటున్నారు. పైన ఫోటోను చూశారు కదా.. అందులో కనిపిస్తున్న బ్యూటీని గుర్తుపట్టారా.. ? రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ ముద్దుగుమ్మ మంచి ఫ్యాన్ బేస్ ఉంది. చూడచక్కని రూపం.. అమాయకమైన నటనతో కట్టిపడేస్తుంది. పైన ఫోటోలో కనిపిస్తున్న బ్యూటీ మరెవరో కాదండి. గుండెనిండా గుడిగంటలు సీరియల్ మీనా అలియాస్ అమూల్య గౌడ. ఈ సీరియల్ ద్వారా తెలుగు అడియన్స్ మదిలో మీనా గా చెరగని స్థానం సంపాదించుకుంది. ఈ భామను అందరూ ముద్దుగా పూలగంప అని పిలుచుకుంటారు. సీరియల్లో నిత్యం చీరకట్టులో సింపుల్ గా కనిపించే మీనా.. బయట మాత్రం చాలా ట్రెండిగా కనిపిస్తుంది. సీరియల్లో చక్కగా చీర, తల్లో మల్లెపూలు పెట్టుకుని కనిపించే అమూల్య.. నెట్టింట అందాలు ఆరబోస్తూ గ్లామర్ ఫోజులతో అరాచకం సృష్టిస్తుంది. ఇప్పుడు ఈ అమ్మడు ఫోటోస్ చూసి షాకవుతున్నారు ఫ్యాన్స్. ప్రస్తుతం అమూల్య గౌడ ఫోటోస్ చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్. నిత్యం చీరకట్టులో కనిపించే పూలగంప.. ఇప్పుడు గ్లామర్ ఫోజులతో నెట్టింట అగ్గి రాజేస్తుందంటూ కామెంట్స్ చేస్తున్నారు. తెలుగులో ఈ కన్నడ బ్యూటీకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. నెటిజన్స్ ఈ అమ్మడి ఫోటోలకు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**